


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 10-05-2026 | సంపుటి - 27 | సంచిక -348 | రూ : 4 | పేజీలు: 8

## స్వీయ గణనపై ఆసక్తి చూపలే..!

- స్పందించింది 3%లోపు కుటుంబాలే...
- నేటితో ముగియనున్న గడువు
- రేపటి నుంచి ఇంటింటికీ గణకులు

హైదరాబాద్: దేశానికి ఎంతో కీలకమైన జనాభా లెక్కల సేకరణలో స్వయంగా భాగస్వామ్యం పంచుకునేందుకు రాష్ట్ర ప్రజల్లో ఆసక్తి కరవైంది. తెలంగాణలో ఏప్రిల్ 26న ప్రారంభమైన స్వీయగణన (వ్యక్తిగత నమోదు/సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఎస్ఈ) ప్రక్రియ ఆదివారం ముగియనుంది. ఇందులో ఈ నెల 9 వరకు 3.70 లక్షల కుటుంబాలు (3%) మాత్రమే తమ వివరాలను సొంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశాయి. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్,

తరువాయి 2లో


## బెంగాల్ పీఠంపై సువేందు

- అట్టహాసంగా రాష్ట్ర తొలి భాజపా సీఎం ప్రమాణం
- మంత్రులుగా మరో ఐదుగురు ఎమ్మెల్యేలు...



కోల్‌కతా: ఒకప్పుడు వామపక్షాలు, నిన్నటి వరకూ మమతా బెనర్జీ కంచుకోటగా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో శనివారం అధికార మార్పిడి సాఫీగా సాగిపోయింది. భాజపా నేత సువేందు అధికారి నేతృత్వంలో శనివారం

తరువాయి 2లో



# నేడు హైదరాబాద్‌కు మోదీ

- రూ.9,377 కోట్ల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నివాసాలకు వెళ్లనున్న మోదీ
- సాయంత్రం పరేడ్‌గ్రౌండ్స్‌లో పార్టీ బహిరంగ సభలో ప్రసంగం
- సభకు కమలనాథుల భారీ జనసమీకరణ

హైదరాబాద్: ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్రమోదీ తొలిసారి ఆదివారం రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. మధ్యాహ్నం రూ.9,377 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి, ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం భాజపా నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. దీంతో ప్రధాని పర్యటన అభివృద్ధి, రాజకీయపరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఎన్నికల్లో భాజపా మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో ప్రధాని హైదరాబాద్ పర్యటనపై ఆసక్తి నెలకొంది. ఇదేసమయంలో నరేంద్రమోదీ తెదేపా, జనసేనల అధినేతలు... ఏపీ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులైన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతోనూ భేటీ కానుండటం మరింత ఆసక్తిని పెంచుతోంది. కమలనాథులు ప్రధాని పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బహిరంగ సభకు భారీ జనసమీకరణ చేస్తున్నారు.

తరువాయి 2లో



# పట్టణీకరణతో భవిష్యత్ లో మరిన్ని సవాళ్లు

- మూసీ పునరుజ్జీవం రాష్ట్ర ప్రగతికి దిక్సూచి
- అధిగమించే ప్రణాళికల అమలే లక్ష్యం
- సిగల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్‌బ్యూరో : ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్, సిగల్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. దానికోసం అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే మూడు స్థాయిల విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదనీ, మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలనీ, పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు సిటీలో మల్టీ లెవెల్ పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

తరువాయి 2లో

## బండికి సన్‌స్ట్రోక్



- కేంద్ర మంత్రి కుమారుడిపై పోక్సో కేసు
- పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో బాధితురాలి తల్లి ఫిర్యాదు
- మా కుమార్తెని లైంగిక వేధింపులకు గురిచేశాడు రెండుసార్లు ఆత్మహత్యాయత్నం ఆరు గంటల హైడ్రామా తర్వాత కేసు నమోదు..!
- నాపై హనీట్రాప్ చేశారు : కరీంనగర్ స్టేషన్‌లో బండి సంజయ్ కొడుకు భగీరథ్ ఫిర్యాదు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం

2లో

## శాంతి చర్చలు విఫలమైతే ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్

- దౌత్య పరిష్కారానికి మోకాలడ్డుతోంది అమెరికాయే : ఇరాన్
- వచ్చే వారం ప్రారంభంలో తిరిగి సంప్రదింపులు ?

2లో



# ముఖ్యమంత్రి విజయ్

- తమిళనాడు సీఎంగా టీవీకే అధినేతను నియమిస్తూ గవర్నర్ ఆర్లేకర్ ఉత్తర్వులు
- నేటి ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం
- 5 పార్టీల మద్దతుతో 120 సీట్లు కూడగట్టుకున్న టీవీకే
- తమిళనాడు వ్యాప్తంగా టీవీకే శ్రేణుల సంబరాలు
- 13న అసెంబ్లీలో బలనిరూపణకు గవర్నర్ ఆదేశం



2లో

## గంటకు 600 కి.మీ. వేగంతో వెళ్లేలా..

- బుల్లెట్ రైల్ కారిడార్ డిజైన్‌లో మార్పులతో డీపీఆర్
- అయితే గరిష్ఠంగా 320 కి.మీ.వేగంతోనే పరుగులు
- హైదరాబాద్ చెన్నై కారిడార్ అమరావతి విమానాశ్రయం మీదుగా వెళ్లేందుకు ఓకే



2లో

# నేడు హైదరాబాద్‌కు మోదీ

హైదరాబాద్: ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్రమోదీ తొలిసారి ఆదివారం రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. మధ్యాహ్నం రూ.9,377 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి, ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం భాజపా నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. దీంతో ప్రధాని పర్యటన అభివృద్ధి, రాజకీయపరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఎన్నికల్లో భాజపా మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో ప్రధాని హైదరాబాద్ పర్యటనపై ఆసక్తి నెలకొంది. ఇదే సమయంలో నరేంద్రమోదీ తెదేపా, జనసేనల అధినేతలు... ఏపీ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులైన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతోనూ భేటీ కానుండటం మరింత ఆసక్తిని పెంచుతోంది. కమలనాథులు ప్రధాని పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బహిరంగ సభకు భారీ జనసమీకరణ చేస్తున్నారు.

**హెచ్‌ఐసీసీలో అధికారిక కార్యక్రమాలు**

ప్రధాని పర్యటన బిజీబిజీగా సాగనుంది. సుమారు మూడు గంటలకుపైగా నగరంలో పర్యటించనున్న మోదీ వరుసగా అనేక కార్యక్రమాల్లో పాల్గొనేలా షెడ్యూలు ఖరారైంది. తొలుత ప్రధాని బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హెచ్‌ఐసీసీకి వెళతారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పలువురు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రూ.9,377 కోట్ల విలువైన అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు చేస్తారు. అక్కడ ప్రధానితోపాటు సీఎం రేవంత్‌రెడ్డి కూడా ప్రసంగించనున్నట్లు సమాచారం. అనంతరం ప్రధానమంత్రి గచ్చిబౌలికి వెళ్లి సాయిసింధు ఆసుపత్రిని ప్రారంభిస్తారు.

**చంద్రబాబు, పవన్ నివాసాలకు మోదీ**

ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనలో మరో ముఖ్యమైన అంశం కూడా ఉంది. సాయిసింధు ఆసుపత్రి ప్రారంభోత్సవం తర్వాత హైదరాబాద్‌లోని ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు నివాసానికి... ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లనున్నారు. చంద్రబాబుతో మర్యాదపూర్వక భేటీ అని భాజపావర్గాలు తెలిపాయి. పవన్ కల్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేసుకొని విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు వెళ్లనున్నట్లు సమాచారం. పవన్ ఇంటికి ప్రముఖ సినీ నటుడు చిరంజీవి సైతం వచ్చి మోదీతో కాసేపు ముచ్చటించనున్నట్లు తెలిసింది.

**పరేడ్ గ్రౌండ్స్ సభావేదికపై 45 నిమిషాలు**

పరేడ్ గ్రౌండ్స్‌లో చేపట్టిన బహిరంగ సభా ప్రాంగణం వద్ద మోదీ సాయంత్రం 6.15 నుంచి 7 గంటల వరకు ఉంటారు. ప్రజలను ఉద్దేశించి ఆయన 40 నిముషాలపాటు మాట్లాడే అవకాశముంది. అంతకుముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ప్రసంగిస్తారు. సభా ప్రాంగణాన్ని ఎస్పీజీ బృందాలు స్వాధీనం చేసుకుని మూడు రోజులుగా ముమ్మర తనిఖీలు చేస్తున్నాయి. సభా ప్రాంగణంలో సామాన్య ప్రజలతోపాటు పలువురు స్వామీజీల కోసం ప్రత్యేక గ్యాలరీను ఏర్పాటు చేశారు. మోదీ పర్యటన ఖరారైనప్పటి నుంచి పరేడ్ మైదానంలో భాజపా శ్రేణులు భారీ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచందర్‌రావుతోపాటు భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా నిత్యం సందర్శిస్తూ సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. నరేంద్రమోదీ భారీ కటౌట్లతో ప్రాంగణం కాషాయమయమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీ జనసమీకరణ చేస్తున్నారు.

**శ్రేణులకు దిశానిర్దేశం**

మోదీ పర్యటనను రాజకీయంగా అత్యంత కీలకమైనదిగా భాజపా శ్రేణులు అభివర్ణిస్తున్నారు. ఇటీవల పశ్చిమబెంగాల్‌లో భారీ విజయం సాధించిన భాజపా... తర్వాత లక్ష్యం తెలంగాణే అని కమలనాథులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ప్రధాని నేటి పర్యటనలో రాష్ట్రానికి చెందిన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జాతీయ కార్యవర్గ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేసే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ప్రతిచోటా ప్రత్యేక స్వాగతం**

ప్రధానికి స్వాగతం పలికేందుకు భాజపా రాష్ట్ర నాయకత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. బేగంపేట విమానాశ్రయం, సాయిసింధు ఆసుపత్రి, పరేడ్‌గ్రౌండ్స్‌లో ప్రత్యేక లైనప్ ఏర్పాటు చేస్తున్నారు. సింధు ఆసుపత్రి వద్దకు పద్మశ్రీ అవార్డు గ్రహీతలను కూడా ఆసుపత్రి నిర్వాహకులు ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో ప్రధాని 1520 నిమిషాలు ఉంటారని సమాచారం. పరేడ్‌గ్రౌండ్స్ వద్ద ప్రధానికి స్వాగతం చెప్పేందుకు ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన సుమారు వంద మంది కార్పొరేటర్లతో లైనప్ ఏర్పాటు చేయించాలని భాజపా నిర్ణయించింది. ఈ మేరకు కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రామగుండం, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్ల నుంచి గెలిచిన కార్పొరేటర్లను రప్పించారు.

# బెంగాల్ పీఠంపై సువేందు

కోల్‌కతా: ఒకప్పుడు వామపక్షాలు, నిన్నటి వరకూ మమతా బెనర్జీ కంచుకోటగా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో శనివారం అధికార మార్పిడి సాఫీగా సాగిపోయింది. భాజపా నేత సువేందు అధికారి నేతృత్వంలో శనివారం నూతన సర్కారు కొలువుదీరింది. బెంగాల్ 9వ ముఖ్యమంత్రిగా, రాష్ట్రంలో భాజపా తొలి సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టారు. కోల్‌కతాలోని చారిత్రక బ్రిగేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి నూతన ముఖ్యమంత్రితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు పాల్గొన్నారు. 1971 తర్వాత కోల్‌కతాయేతర జిల్లా నుంచి సీఎం పదవి చేపట్టిన మొదటి వ్యక్తిగా సువేందు నిలిచారు. మంత్రులుగా దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, అశోక్ కీర్తనియా, నిశీశ్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడూ ప్రమాణం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో సోనార్ బంగ్లా యుగానికి అధికారికంగా శ్రీకారం చుట్టామని ప్రమాణ స్వీకారానికి ముందు సువేందు అధికారి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఒకే వాహనంలో మోదీ, సువేందు..: ప్రమాణ స్వీకారానికి ముందు ప్రధాని మోదీ, సువేందు అధికారి ఒకే వాహనంలో వేదికవద్దకు వచ్చారు. నినాదాలతో హోరెత్తిస్తున్న ఎన్డీయే మద్దతుదారులకు అభివాదం చేస్తూ ఇద్దరూ ముందుకు సాగారు. వేదిక వద్ద రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి మోదీ నివాళులర్పించారు. వేదికపైకి వచ్చిన ప్రధాని ప్రజలకు ప్రణామం చేశారు.

# బండికి సన్‌స్ట్రోక్

కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి : బాలికపై లైంగికవేధింపుల ఆరోపణలతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజరు కుమారుడిపై పేట్ బషీరాబాద్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకెళ్తే.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సుచిత్ర ప్రాంతానికి చెందిన 17 ఏండ్ల బాలికను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజరు కుమారుడు బండి భగీరథ్ లైంగిక వేధింపులకు గురిచేసినట్టు బాధితురాలి తల్లి శుక్రవారం రాత్రి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ప్రకారం, బాధిత బాలికకు బండి భగీరథ్‌తో గత ఏడాది కాలంగా పరిచయం ఉన్నట్టు తెలుస్తోంది. మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా బాలికపై అతను లైంగికదాడికి యత్నించాడని బాధితురాలి తల్లి ఆరోపించింది. ఈ ఘటనల కారణంగా బాలిక మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురై రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిపింది. కాగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. భగీరథ్‌పై కేసు నమోదు నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

*** ఆరు గంటల హైడ్రామా తర్వాత కేసు నమోదు..!**

ఇదిలా ఉంటే, తన కుమారుడిపై కేసు నమోదు కాకుండా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజరు తీవ్ర ప్రయత్నాలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సుమారు ఆరు గంటలపాటు హైడ్రామా నడిచిన అనంతరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్టు సమాచారం. దీనిపై శనివారం ఉదయం నుంచి మీడియాలో వార్తలు రావడంతో కేసు నమోదు చేసినట్టు తెలిసింది. ఇక గతంలో ఉత్తరప్రదేశ్‌లో కూడా బండి భగీరథ్‌పై వివాదాస్పద ఆరోపణలు వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మహీంద్రా యూనివర్సిటీలో చదువుతున్న సమయంలో ఓ సహ విద్యార్థినిపై దాడి ఘటనలో కూడా ఆయన పేరు వినిపించిన సంగతి తెలిసిందే.

*** నాపై హనీట్రాప్ చేశారు : బండి సంజరు కొడుకు భగీరథ్ ఫిర్యాదు**

స్నేహితులతో కలిసి తనతో పరిచయం పెంచుకుని స్నేహం పేరుతో సన్నిహితంగా ఉంటూ తనపై హనీట్రాప్ చేశారని, కావాలని తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజరు కుమారుడు భగీరథ్ కరీంనగర్ స్టేషన్‌లో ఈనెల 8న సాయంత్రం ఇచ్చిన ఫిర్యాదు వెలుగులోకి వచ్చింది. తన కూతురుకు మద్యం తాగించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని భగీరథ్‌పై బాధితురాలి తల్లి హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పోక్సో కేసు నమోదు చేయాలనే డిమాండ్ సర్వత్రా వెల్లువెత్తింది. ఈ నేపథ్యంలో భగీరథ్ ముందు రోజే కరీంనగర్‌లో ఫిర్యాదు చేశాడన్న ఎఫ్ఐఆర్ కాపీ ఇప్పుడు బయటకి రావడం గమనార్హం.

# ముఖ్యమంత్రి విజయ్

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రిగా సి.జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. తనకు మద్దతిచ్చే పార్టీల సమ్మతి లేఖలతో నాలుగోసారి శనివారం సాయంత్రం గవర్నర్ ఆర్లేకర్‌ను కలిసిన విజయ్.. సుమారు గంటన్నరపాటు ఆయనతో చర్చించారు. అనంతరం 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం విజయ్‌ను ముఖ్యమంత్రిగా నియమిస్తున్నాను' అంటూ విజయ్‌కు గవర్నర్ ఉత్తర్వు ప్రతిని అందించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసుకునేలా అనుమతిచ్చారు. ఈ నెల 13 నాటికి అసెంబ్లీలో బలనిరూపణ ద్వారా మెజారిటీ చూపాలని విజయ్‌తో పాటు వెంట వచ్చిన మిత్రపక్షాల ప్రతినిధులకు గవర్నర్ సూచించారు. దీంతో చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో విజయ్ ప్రమాణ స్వీకార వేడుకకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. సీఎం సహా కొందరు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసేలా టీవీకే ప్రణాళికలు రచిస్తోంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరుకానున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

# స్వీయ గణనపై ఆసక్తి చూపలే!

హైదరాబాద్: దేశానికి ఎంతో కీలకమైన జనాభా లెక్కల సేకరణలో స్వయంగా భాగస్వామ్యం పంచుకునేందుకు రాష్ట్ర ప్రజల్లో ఆసక్తి కరవైంది. తెలంగాణలో ఏప్రిల్ 26న ప్రారంభమైన స్వీయగణన (వ్యక్తిగత నమోదు/ సెల్ఫ్ ఎన్యూమరేషన్‌ఎస్‌ఈ) ప్రక్రియ ఆదివారం ముగియనుంది. ఇందులో ఈ నెల 9 వరకు 3.70 లక్షల కుటుంబాలు (3%) మాత్రమే తమ వివరాలను సొంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశాయి. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఎస్‌ఈలో 85 లక్షల కుటుంబాలు సొంతంగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాయి. తెలంగాణ జనాభా సుమారు 3.60 కోట్లకుపైగా ఉంటుందని, కుటుంబాల సంఖ్య 1.30 కోట్లని అనధికారిక అంచనా. వీరిలో 10% కుటుంబాలైనా సొంతంగా వివరాలను నమోదు చేస్తాయని వేసిన అంచనాలు నెరవేరలేదు. ఎస్‌ఈ ప్రక్రియ స్వచ్ఛందమని ప్రకటించడంతో 97% మంది ప్రజలు సీరియస్‌గా తీసుకోలేదని అధికారులు భావిస్తున్నారు.

**10 లక్షల మంది ఐటీ ఉద్యోగులున్నా...**

తెలంగాణలో దాదాపు 10 లక్షల మంది ఐటీ ఉద్యోగులున్నారు. వారిలో సగం మేరకైనా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయకపోవడంపై కేంద్ర జనాభా లెక్కల విభాగం ఆశ్చర్యం వ్యక్తంచేస్తోంది. ఐటీరంగ ఉద్యోగుల్లో ఎక్కువ శాతం మంది రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోకి వచ్చే హైదరాబాద్ నగర ప్రాంతాల్లోనే పనిచేస్తున్నారు. కానీ, ఈ రెండు జిల్లాల్లో 76 వేల మంది మాత్రమే ఆన్‌లైన్‌లో తమ కుటుంబ వివరాలను నమోదు చేశారు. అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో 42,982, అత్యల్పంగా ములుగులో 1,556 కుటుంబాలు మాత్రమే వివరాలను నమోదు చేశాయి. ఐదు జిల్లాల్లో కనీసం 5వేల కుటుంబాల చొప్పునైనా ముందుకురాలేదు.

**ఆఖరి రోజైనా ముందుకు రావాలి...**

ప్రతి ఇంట్లో ఉన్న సౌకర్యాలు, గ్రామ, మండల, జిల్లా వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించి నమోదు చేసేందుకు ఈ నెల 11 నుంచి జూన్ 9వ తేదీ వరకు జనగణకులు ఇంటింటికీ రానున్నారు. వీరికి ఒక్కో కుటుంబం వద్ద గంట నుంచి రెండు గంటలకుపైగా సమయం పడుతుంది. ఎస్‌ఈలో ప్రజలే సొంతంగా వివరాలను నమోదు చేస్తే వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయడానికి జనగణకులకు అవసరమైన సమయం సగానికి పైగా తగ్గిపోతుంది. అందుకే ప్రజలంతా స్వచ్ఛందంగా ఆదివారం అర్ధరాత్రి 12 గంటలలోగా se.census.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ వివరాలను నేరుగా నమోదు చేయాలని అధికారులు కోరుతున్నారు.

# శాంతి చర్చలు విఫలమైతే ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్ : ట్రంప్

ఇరాన్‌తో శాంతి చర్చలు విఫలమైతే తన ప్రభుత్వం తిరిగి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను చేపడుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. గల్ఫ్‌లో ఉద్రిక్తత లు పెరుగుతున్నాయని, హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలు చిక్కుబడిపోయాయని, ఇలాంటి పరిస్థితులలో తన ప్రభుత్వం తిరిగి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను ప్రారంభించవచ్చునని ఆయన తెలిపారు. హార్ముజ్‌లో వాణిజ్య నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించేందుకు వీలుగా వాటికి రక్షణ కల్పించేందుకు ట్రంప్ ప్రభుత్వం 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను చేపట్టడం, పాకిస్తాన్ తదితర దేశాల అభ్యర్థనతో దానిని రెండు మూడు రోజులకే నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇరాన్‌పై జరిపిన సైనిక చర్యలో అత్యద్భుత సైనిక ప్రయోజనాలు సాధించామని, ఇరాన్ ప్రతినిధులతో జరుగుతున్న చర్చలలో ఒప్పందం దిశగా పురోగతి సాధించామని, అందుకే 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను నిలిపివేస్తున్నామని కూడా ఆయన చెప్పుకొచ్చారు. వర్జీనియాలోని స్టెర్లింగ్‌లో ఉన్న తన గోల్ఫ్ కోర్స్‌లో విందుకు హాజరయ్యేందుకు వెళుతూ శుక్రవారం ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' తిరిగి ప్రారంభమైతే అది 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'గా విస్తృతమవుతుందని ఆయన తెలిపారు. ఒప్పందంపై సంతకాలు జరగకపోతే తాము వేరే దారిలో నడుస్తామని ట్రంప్ బెదిరించారు. 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ మంచి దని నేను అనుకుంటున్నాను. అయితే ఆ పని చేయడానికి మాకు వేరేదారులు కూడా ఉన్నాయి. పనులు అనుకున్న విధంగా జరగక పోతే మేము తిరిగి ప్రాజెక్ట్ ఫ్రీడమ్ వైపు వెళతాము. అయితే అది ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్ అవుతుంది. అంటే ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌తో పాటు ఇతర అంశాలు కూడా ఉంటాయి' అని నర్మగర్భంగా చెప్పారు. ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే చర్చలను జాప్యం చేస్తోందా అని ప్రశ్నించగా ఆ విషయం చెప్పలేనని అన్నారు. ఇదిలావుండగా చర్చల సందర్భంగా దౌత్య పరిష్కారం ప్రస్తావనకు వచ్చిన ప్రతిసారీ అమెరికా నిర్లక్ష్య ధోరణితో సైనిక సాహసానికి పాల్పడుతూనే ఉన్నదని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ ఆరోపించారు. దౌత్యపరిష్కారానికి మోకాలడ్డుతోంది అమెరికా యేనని మండిపడ్డారు. ఇరాన్ ఎన్నటికీ ఒత్తిడులకు లొంగబోదని ఆయన సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో స్పష్టం చేశారు.

# పట్టణీకరణతో భవిష్యత్ లో మరిన్ని సవాళ్లు

హైదరాబాద్‌బ్యూరో: ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్, సిగల్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. దానికోసం అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే మూడు స్థాయిల విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదనీ, మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలనీ, పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు సిటీలో మల్టీ లెవెల్ పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. శనివారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇతర సభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలపై చర్చించారు. అంతకుముందు అధికారులు తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పార్లమెంటరీ స్టాండిగ్ కమిటీకి వివరించారు. ఆయా ప్రాజెక్టులను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించేలా చొరవ చూపాలని కమిటీకి అధికారులు విజ్ఞప్తి చేశారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆసక్తి కనబర్చింది. ఇదో విప్లవాత్మక నిర్ణయమని కమిటీ చైర్‌పర్సన్ శ్రీనివాసులు రెడ్డి ప్రసంసించారు. ఒక నదిని పునరుజ్జీవం చేయడం దేశంలోనే మొదటిదని అభిప్రాయపడ్డారు. ఈ ప్రణాళికపై సీఎం రేవంత్‌రెడ్డిని అభినందించారు. అలాగే రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలనూ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ భాగాలుగా విభజించి, దానికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ పనితీరును అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా ఉన్న ఎంపీలు అలోక్‌శర్మ, కున్వర్ సింగ్ తన్వర్, లవ్లీ ఆనంద్, మహిమా కుమారి మేవార్, మాలా రాజ్యలక్ష్మిషా, గుమ్మ తనుజా రాణి, హిబి ఎడెన్, సంజరు దినాపాటిల్, రవీంద్రవైకర్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గంటకు 600 కి.మీ. వేగంతో వెళ్లేలా..

అమరావతి: హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై, బెంగళూరు, చెన్నై నుంచి బెంగళూరు మధ్య బుల్లెట్ రైళ్లు నడిపేందుకు రైల్వే శాఖ నిర్మించ తలపెట్టిన హైస్పీడ్ రైల్ కారిడార్లలో.. గంటకు 600 కి.మీ. వేగంతో రైళ్లు వెళ్లే డిజైన్‌తో రూపొందించనున్నారు. ఇప్పటి వరకు గంటకు 350 కి.మీ. వేగంతో రైళ్లు వెళ్లే డిజైన్‌తో ఫైనల్ లొకేషన్ సర్వే, డీపీఆర్ తయారు చేస్తున్నారు. 600 కి.మీ. వేగంతో ఉండేలా డిజైన్‌లో మార్పు చేయాలంటూ నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) తాజాగా ఆదేశించింది. రైల్వే అధికారులు ఆ మార్పులతో డీపీఆర్ తయారు చేస్తున్నారు. గంటకు 600 కి.మీ. వేగం డిజైన్‌తో కారిడార్లు నిర్మించినా బుల్లెట్ రైళ్లను మాత్రం గరిష్ఠంగా గంటకు 320 కి.మీ. వేగంతోనే నడుపుతారు.

**అమరావతి విమానాశ్రయం మీదుగా..**

హైదరాబాద్ అమరావతి చెన్నై మధ్య హైస్పీడ్ రైల్వే లైన్‌ను అమరావతిలో నిర్మించనున్న విమానాశ్రయం మీదుగా వెళ్లేలా ఎలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని సీఎం చంద్రబాబు గత ఏడాది అక్టోబరులో రైల్వే శాఖ అధికారులతో సమీక్షలో సూచించారు. ఈ మేరకు అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపగా, రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. హైదరాబాద్ చెన్నై లైన్‌కు రెండు ఎలైన్‌మెంట్లు పరిశీలిస్తున్నారు. హైదరాబాద్‌లోని ముంబయి వైపు వెళ్లే హైస్పీడ్ రైల్ కారిడార్ పాయింట్ నుంచి శంషాబాద్, బాటసింగారం, నార్కెట్‌పల్లి, ఖమ్మం/ కోదాడ మీదుగా ఏపీలోకి ప్రవేశించి అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి విమానాశ్రయం స్టేషన్ల మీదుగా చెన్నై సెంట్రల్ వరకు ఎలైన్‌మెంట్‌ను రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ (రైట్స్) ప్రతిపాదించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లోని ముంబయి వైపు వెళ్లే హైస్పీడ్ రైల్ కారిడార్ పాయింట్ నుంచి శంషాబాద్, భారత్‌సిటీ (ఫ్యూచర్ సిటీ), ఏపీలో దాచేపల్లి, అమరావతి మీదుగా.. అక్కడి నుంచి రైట్స్ ప్రతిపాదించిన మార్గాన్ని సూచించింది.

# కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు పాటుపడాలి

*** జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు పాటుపడాలని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని రోడా మేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని లెనిన్ నగర్ కాలనీ అధ్యక్షుడికి జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన పింగళి రాజిరెడ్డి శనివారం కార్పొరేటర్ కొలుకుల జగన్ ని మగ్దూంనగర్లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ జగన్ మాట్లాడుతూ అధ్యక్షుడిగా విజయం సాధించిన రాజిరెడ్డి కి. సెక్రటరీ.సీహెచ్.సాయిలు కు శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధికి నూతన అధ్యక్షుడు , వారి కార్యవర్గం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లెనిన్ నగర్ కాలనీ సభ్యులు తార సింగ్, రామ్ నరసయ్య, మల్లారెడ్డి.రవీందర్ రెడ్డి, భాస్కర్. తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బజ్జూరి వెంకటరెడ్డి నియామకం



ప్రజా స్ఫూర్తి, కూసుమంచి: కూసుమంచి మండల పార్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బజ్జూర్ వెంకటరెడ్డి నియమిస్తూ పిసిసి తెలంగాణ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నియమించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన వెంకటరెడ్డికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ జూకూరు గోపాలరావు, చాట్ల పరశురాములు తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఫాస్ట్ ట్రాక్ చెక్ పోస్టులను ఎత్తివేయాలి

*** తపాల్‌పూర్ చెక్ పోస్ట్ వద్ద బీజేపీ రాస్తారోకో**



ప్రజాస్ఫూర్తి , జన్నారం : అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ చెక్‌పోస్టులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో తపాల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద శనివారం రోజున రాస్తారోకో చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు జీ. మధుసూదన్ రావు మాట్లాడుతూ, ఫాస్ట్ ట్రాక్ పేరుతో అటవీ శాఖ అధికారులు వాహనదారుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు.జన్నారం మండలంలోని ఇందనపల్లి, తపాల్‌పూర్ వద్ద ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ చెక్‌పోస్టులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.స్థానిక వాహనాలకు మినహాయింపు లేకపోవడంతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోజూ తిరిగే వాహనాలకు రుసుము భారంగా మారిందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల రమేష్ గౌడ్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా బద్రీనాయక్,పోనకల్ ఉపసర్పంచ్ అప్పల జలపతి, పార్టీ సీనియర్ నాయకులు కొంతం శంకరయ్య,సామల లక్ష్మీరాజం,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఒవైసీని జైల్లో వేసే దమ్ము, ధైర్యం సీఎం రేవంత్‌కు ఉందా?



హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటన రాజకీయాల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోందని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేసే పర్యటన అని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ పేర్కొన్నారు. మోడీ అంటే మోడల్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా అని, దేశ ప్రజలు తమ తీర్పుతో ఆయన పట్ల ఉన్న విశ్వాసాన్ని పదే పదే నిరూపిస్తున్నారని అన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కమలం జెండా రెపరెపలాడుతున్న వేళ, గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగిరే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మోడీ వికాస్, విశ్వాస్, విరాసత్' అనే నినాదాలతో 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్'ను ఆచరణలో చూపిస్తుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్, ఇండి కూటమికి ఎటువంటి అజెండా లేదని విమర్శించారు. కాంగ్రెస్ , బీఆర్ఎస్ , మజ్లిస్‌పార్టీల పేర్లు వేరైనా వారి విధానాలు ఒకటేనని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నాయకత్వాన్ని మెప్పించుకోవడానికి కాంగ్రెస్ ఈజ్ ముస్లిం, ముస్లిం ఈజ్ కాంగ్రెస్ అనే స్థాయికి దిగజారి అనుముల రేవంత రెడ్డిగా మారుతున్నారని ఆరోపించారు. ఆయన హేట్ స్పీచ్ చట్టం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని, ధైర్యముంటే హిందువులపై విమర్శలు చేసే ఓవైసీని జైల్లో వేయాలని సవాల్ విసిరారు. తెలంగాణకు ఎయిమ్స్, రామగుండం ఎరువుల కర్మాగారం, జాతీయ రహదారులు, రైల్వేలు, టెక్స్‌టైల్ పార్కులు, కొత్తగా హైస్పీడ్ రైళ్లు వంటి వేల కోట్ల అభివృద్ధిని ప్రధాని మోడీ అందించారని వివరించారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే మరింత వేగంగా అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని, అందుకే పార్టీలకు అతీతంగా ఆయన పర్యటనకు స్వాగతం పలుకుతున్నారని అన్నారు. తమిళనాడులో కాంగ్రెస్ తన అధికార దాహంతో ద్రోహపూరిత రాజకీయాలు చేస్తోందని, డీఎంకే సైతం వారిని అసహ్యించుకుంటోందని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రక్షాళన అనేది ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రక్రియ అని, దొంగ ఓట్లు, రోహింగ్యాల ఓట్ల కోసం దానిని అడ్డుకుంటామని రేవంత్ రెడ్డి అనడం రాజ్యాంగ విరుద్ధమని హెచ్చరించారు. 2029 నాటికి తెలంగాణలో బీజేపీ బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందన్నారు.

# ఓటరు జాబితాలో తప్పులు లేకుండా నాయకులు, బిఎల్‌ఏలు అప్రమత్తతో పనిచేయాలి

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా నాయకులు, బిఎల్ఏలు అప్రమత్తతో పనిచేయాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం రంగారెడ్డి నగర్ డివిజన్ లోని ఆదర్శ్ నగర్ కమ్యూనిటీ హాల్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) పై నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిధిగా హాజరై కార్యక్రమ నిర్వాహణ, పాటించవలసిన నియమ, నిబంధనలు, సర్ కార్యక్రమ ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం అద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సర్ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు, డూప్లికేట్ ఓట్లు, పర్మినెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం, కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, ఇంకా ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు, బిఎల్ఏలు, సంక్షేమ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్, యువత ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలనేలా పనిచేయాలన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంకై చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకువెళ్లాలనే చేపట్టవలసిన కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, మాజీ డివిజన్ అధ్యక్షులు ఎర్ర శంకరయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

*** విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను అన్ని జిల్లాల్లో వంద శాతం పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు ఒక్కరోజు మాత్రమే గడువు మిగిలి ఉండటంతో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నందున ప్రతి ఉద్యోగి స్వీయ గణన తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యా వారోత్సవాలను ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. అలాగే సెన్సస్ కార్యక్రమంపై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పూర్తి స్థాయి దిశానిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రిస్టియన్ల రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : దళిత క్రిస్టియన్లకు రిజర్వేషన్ల హోదా రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంతో, వెంటనే దళిత క్రిస్టియన్లకు రిజర్వేషన్ల రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆఫ్ నల్గొండ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్ బి ఆర్ ఫంక్షన్ హాల్ లో క్రిస్టియన్ మేధావులు ఉద్యోగులు ఫాదర్లు తదితర స్వచ్ఛంద సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో దళిత క్రైస్తవుల కు సంక్రమించే హక్కుల గురించి వివరంగా తెలియజేశారు అన్నారు. రిజర్వేషన్లను అమలు చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి వివిధ రూపాలలో నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. డాక్టర్ క్రిస్టోఫర్ అధ్యక్షతనజరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రెవరెండ్ గాలి వినోద్,కడిమి కృష్ణ,రాజీవ్ సాగర్,సాల్మన్ రాజు,రెవరెండ్ జగ్జీవన్, పసలశౌరయ్య, ప్రశాంత్, ఎలీషా, ఆచయ్య,ప్రభు చరణ్, ప్రవీణ్ కుమార్, ప్రదీప్, సామ్యూల్, ప్రకాష్, లక్ష్మయ్య, జేమ్స్,తదితరులు పాల్గొన్నారు..

# దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఈ జన గణన కార్యక్రమంలో వివరాలను నమోదు చేసుకోవాలి

*** జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఈ జన గణన కార్యక్రమంలో పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కోరారు. ప్రభుత్వ సూచనలు,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ఆదేశాల మేరకు జనాభా గణన కార్యక్రమంలో శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ సెంటర్ నుండి బస్టాండ్ వరకు స్వీయ గణన మారథాన్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్, అదనపు జనగణన అధికారి అనిల్ కుమార్, హాజరై ర్యాలీని ప్రారంభించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ స్వీయ గణన వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు,ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన ప్రారంభించి నిర్వహించడం జరుగుతుందని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన,ఇండ్ల సందర్శన జనగణన సిబ్బంది హాజరుకానున్నారని, ఆ కార్యక్రమంలో తమ వివరాలన్నీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డిపిఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, సెన్సెస్ సిబ్బంది వినయ్, ఉద్యోగులు అశోక్, రాము, వెంకటేశ్వర్లు,తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, స్వయం సహాయక బృందాల సభ్యులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పవనసుత హనుమాన్ స్వామి వారి కృపాకటాక్షలు భక్తులపై సంపూర్ణంగా ఉండాలి

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : పవనసుత హనుమాన్ స్వామి వారి కృపాకటాక్షలు భక్తులపై సంపూర్ణంగా ఉండాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. శనివారం చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన హనుమాన్ పూజా కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బలం, భక్తి, బుద్ధికి ప్రతీక హనుమంతుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకట్, దిలీప్, రాజు గౌడ్, నాయకులు వేణు యాదవ్, అరుణ్, కిషోర్ చారి, రాకేష్ జలిగాం తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకి హనుమాన్ చిత్రపటాన్ని బహుకరించిన మైనార్టీ నాయకులు



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద గాజుల రామారం డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ కి చెందిన మైనార్టీ నాయకులు ఫయాజ్ బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి తాను స్వయంగా రూపొందించిన హనుమాన్ చిత్రపటాన్ని ఎమ్మెల్యే కి బహుకరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.


# అంగరంగ వైభవంగా శ్రీరామ యజ్ఞం



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం గ్రామంలో శనివారం శ్రీ భక్తాంజనేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రామ యజ్ఞాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగగా, వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య యజ్ఞ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.శ్రీ రామ యజ్ఞంలో సుమారు 70 మందికి పైగా దీక్షాపరులు పాల్గొని ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు.భక్తులు కుటుంబ సమేతంగా హాజరై శ్రీరాముని ఆశీస్సులు పొందారు.గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.

# బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

*** డిఎస్పీ కె. శివరాం రెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణంలో శాంతిభద్రతలు, పరిశుభ్రత, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా చర్యలు చేపడుతోందని ఈ నేపథ్యంలో డిఎస్పీ కె. శివరాం రెడ్డి స్థానిక కార్పొరేటర్లు, ముస్లిం మత పెద్దలు, పండుగ నిర్వాహకులు బీఫ్ షాపుల యజమానులతో పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. రానున్న బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు.సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా నిషేధిత జంతువులను ఎట్టి పరిస్థితుల్లోనూ వధించకూడదని, జంతువుల రవాణా సమయంలో వెటర్నరీ డాక్టర్ ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన జంతువుల వధ పూర్తిగా నిషేధమని తెలిపారు. బీఫ్ షాపుల యజమానులు తమ వ్యాపార ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరదాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనిపై కార్పొరేటర్లు తమ వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పరిశుభ్రమైన వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియా వినియోగంపై కూడా డిఎస్పీ ప్రత్యేకంగా అప్రమత్తం చేశారు. కుర్బానీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి ఇతరుల మనోభావాలను దెబ్బతీయకూడదని సూచించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు లేదా సందేశాలు పంపించే వారిపై ఐటీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వాహనాలను అడ్డుకోవడం, గొడవలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించినా వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా డిఎస్పీ కె. శివరాం రెడ్డి మాట్లాడుతూ, "బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక. ఈ పండుగను అందరూ సోదరభావంతో, పరస్పర గౌరవంతో జరుపుకోవాలి. ప్రజలు, వ్యాపారులు, మత పెద్దలు పోలీసు శాఖకు మరియు మున్సిపల్ అధికారులకు సహకరించి పట్టణంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలి" అని పిలుపునిచ్చారు.

# మహిళ ఉద్యోగుల వీడియోలు ఫోటోలు మార్ఫింగ్ చేసి లాప్ టాప్ లో పొందుపరిచిన ఘనుడు

* పోలీసుల అదుపులో నిందితుడు.

హుస్నాబాద్,ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో ఆర్టిజియన్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగి భాగోతం బట్టబయలైంది. హుస్నాబాద్ డివిజన్ కార్యాలయంలో మహేష్ అనే కంప్యూటర్ ఆపరేటర్ గత పది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాడు ఈ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ అసభ్యకర వీడియోలు ఫోటోలను లాప్ టాప్ లో పొందుపరిచి వికృత ఆనందాన్ని పొందుతున్నాడు.అందరితో కలివిడిగా ఉంటూనే ఆఫీసులోనే మహిళా ఉద్యోగులు ఇతర మహిళల ఫోటోలను రహస్యంగా సేకరించి ఆ ఫోటోలను తన పర్సనల్ లాప్ టాప్ అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడు.అయితే




ఒక మహిళా ఉద్యోగిని కంప్యూటర్ ఆపరేటర్ ఆఫీసులో వెళ్లేసరికి సదరు కంప్యూటర్ ఆపరేటర్ తన మార్ఫింగ్ ఫోటో చేసినటువంటి క్లిప్పులు కనబడడంతో ఒక్కసారిగా అవాక్కయింది.సదరు విషయంపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు నిజాలు బయటికి వచ్చాయి.విద్యుత్ శాఖ డి ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన హుస్నాబాద్ సిఐ,ఎస్ఐ నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా అతని విచారణలో విస్తుర పోయే నిజాలు ఒక్కసారిగా బయటికి వచ్చాయి. హుస్నాబాద్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఈ మార్ఫింగ్ కు పాల్పడుతున్న మోసగాడు అసలు బాగోతం పోలీసుల విచారణలో బయటపడ్డాయి. తన లాప్ టాప్ లో ఏకంగా 1300 వీడియోలు, 2500 ఫోటోలను మార్ఫింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. మహిళా ఉద్యోగుల ఫోటోలు తీసి మార్ఫింగ్ చేసి ఆ తర్వాత రాక్షసానందాన్ని పొందుతున్న నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ వీడియోలను తన సొంత లాప్ టాప్ లో ఉంచుకున్నాడా.లేదా ఎవరికైనా ఫార్వర్డ్ చేశాడా. అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారు.

# బహిరంగ రహదారులపై బైక్ స్టంట్లు, ప్రమాదకర డ్రైవింగ్‌కు పాల్పడుతున్న

* ఆరుగురు నిందితుల అరెస్ట్

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి: పీపుల్స్ న్యూస్ : బహిరంగ రహదారులపై ప్రాణాపాయం కలిగించే విధంగా బైక్ స్టంట్లు చేస్తూ, మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఆరుగురు నిందితులను రాజేంద్రనగర్ జోన్ టాస్క్ ఫోర్స్ , అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం గత కొంతకాలంగా అత్తాపూర్ నుండి ఆరాంఘర్ మధ్య ప్రధాన రహదారులపై కొందరు యువకులు ద్విచక్ర వాహనాలతో ప్రమాదకర విన్యాసాలు (స్టంట్లు) చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. వీరు కేవలం తమ ప్రాణాలనే కాకుండా, పాదచారుల , ఇతర వాహనదారుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారు. ట్రిపుల్ రైడింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, వీలీలు వంటి స్టంట్లు చేస్తూ వాహనాల నుండి నిప్పురవ్వలు వచ్చేలా రాపిడి చేస్తూ వీరంగం సృష్టిస్తున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించిన పోలీసులు, హసన్ నగర్ కు చెందిన సయ్యద్ షాహెద్ (19), షేక్ నసీర్ హుస్సేన్ (19), షేక్ జునైద్ (18), కాలాపత్తర్కు చెందిన మొహమ్మద్ బిన్ ఇసా (17), నలుగురు గతంలో బహదూర్‌పురా పి.ఎస్ పరిధిలో ఇటువంటి బైక్ స్టంట్ల కేసుల్లో నిందితులుగా ఉన్నారు కాలాపత్తర్ కు చెందిన అబ్దుల్ సమద్ (20) , ఎన్.టి.ఆర్ నగర్ కు చెందిన మొహమ్మద్ అర్బాజ్ హుస్సేన్ ఖాన్ (22) లు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అత్తాపూర్ పి.ఎస్ లో పోక్సోకేసు నమోదై మొహమ్మద్ అర్బాజ్ హుస్సేన్ ఖాన్ వీరి నుండి నేరానికి ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలను , 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అత్తాపూర్ పి.ఎస్ లో పోక్సో కేసు నమోదైనట్లు తెలిపారు.

# ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దేశ ప్రధాని మోడీ కు బహిరంగ లేఖ విడుదల

* ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్ ) సిద్దిపేట జిల్లా సమితి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పదేళ్లుగా తెలంగాణ ప్రజలకు, యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు మళ్లీ కొత్త హామీలతో ప్రజలను మోసం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఏ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్ ఆరోపించారు.తెలంగాణ కు వస్తున్న నరేంద్ర మోదీకీ బహిరంగ లేఖ ద్వారా సమాధానం అడుగుతున్నామని, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్ లో జరిగిన సమావేశంలో బహిరంగ లేఖ విడుదల చేశారు.ఈ సందర్భంగాఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్ మాట్లాడుతూ ఒకవైపు దేశ యువతకు నరేంద్ర మోడీ 2014 ఎన్నికల సమయంలో ప్రతి సంవత్సరం "2 కోట్ల ఉద్యోగాలు" సృష్టిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారిక గణాంకాలు, నిరుద్యోగ సమస్య, ఖాళీ ప్రభుత్వ పోస్టులు, పెరుగుతున్న కాంట్రాక్టు విధానం నేపథ్యంలో ఆ హామీ పూర్తిగా ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు.అదే విధంగా తెలంగాణకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ? 2014 విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన ప్రధాన హామీలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు .ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బిచ్చల శ్రీనివాస్ వేల్పుల చంద్రశేఖర్ యువ మహిళా నాయకురాలు తొందూరి రేవతి లక్ష్మణ్,నూనె శ్రీకాంత్, సుంక రాజు, బేబీ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జిల యాజమాన్యాలు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

: ఎస్పీ రోహిత్‌రాజు




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో లాడ్జిలను నడిపించే యజమానులు నేరచేదనలో, నేరాలను నియంత్రించడంలో పోలీసు వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాలులో లాడ్జిల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి ఎస్పీ పలు సూచనలు చేశారు. లాడ్జిలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ఖచ్చితమైన నియమ నిబంధనలను పాటిస్తూ సామాజిక బాధ్యతను కలిగి ఉండి పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా లాడ్జీ యాజమాన్యాలకు పలు సూచనలను చేశారు. లాడ్జీలో చేరే వారి పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబర్, వచ్చిన సమయం, వెళ్ళే సమయాన్ని రిజిస్టర్‌లో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. , విదేశీయులు ఎవరైనా లాడ్జిలో స్టే చేస్తేవారి వివరములు 24 గంటల లోపు ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు సమర్పించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు రిజిస్టర్‌లోని సమాచారం, గుర్తింపు కార్డుల జిరాక్స్ కాపీలను సంబంధిత పోలీస్ స్టేషన్లో సమర్పించాలని చెప్పారు. ఎంట్రన్స్, రిసెప్షన్ కారిడార్, బయటవైపు రోడ్డు కనిపించే విధంగా, రాత్రి వేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా పని చేసే స్థితిలో ఉన్న సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వీటి ఫుటేజిని కనీసం 30 రోజుల వరకు భద్రపరచాలని సూచించారు. అనుమానాస్పదంగా అనిపించే లగేజిని తనిఖీ చేయాలని, అధిక మొత్తంలో బ్యాగులు లేదా అనుమానిత వస్తువులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉన్నా, తప్పుడు వివరాలు ఇస్తున్నారని అనిపించినా, లాడ్జి గదుల్లో మద్యం సేవించడం, జూదం ఆడటం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అపరిచిత వ్యక్తులు గ్రూపులుగా వచ్చి బస చేసినా వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ కి లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే, చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, లాడ్జి లైసెన్సు రద్దు చేయిస్తామని హెచ్చరించారు.

# మిల్లర్లు ధాన్యం దిగుమతులను ఆలస్యం చేయకుండా వెంటనే దించుకోవాలి

* రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వరిధాన్య కొనుగోళ్లు ముమ్మరం అవుతున్న సందర్భంగా, మిల్లర్లు వెంటనే ధాన్యం దిగుమతులు చేసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరిపడా హమాలీలను పెంచుకోవాలని , వెంటనే షిఫ్ట్ ల వారిగా దిగుమతులు వెంటనే జరిగేలా చూడాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లకు పీపీసీ సెంటర్ లో అదనంగా లారీలు పెట్టమని ఆదేశించారు. ఈ సమావేశం లో డిసీఎస్ఓ,డిఎంసీఎస్, ఆర్టీఓ , డిటీసీఎస్ లు పాల్గొన్నారు.

# నల్లగొండలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

* 300 గ్రాముల గంజాయి, రెండు బైకులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం.
* నల్లగొండ డీఎస్పీ శ్రీ కె. శివరాం రెడ్డి




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, అక్రమంగా గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్న గంజాయి ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి తెలిపారు.శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డి.ఎస్.పి మాట్లాడుతూ ఈ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడని నిందితుల వద్ద నుండి సుమారు రూ.3 లక్షల విలువైన 300 గ్రాముల గంజాయి, రెండు పల్సర్ మోటార్ సైకిళ్లు , రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.ఈ మేరకు నల్లగొండ II టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నల్లగొండలోని ఎన్జీ కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్, మహమ్మద్ సోహెల్, నల్లగొండ శ్రీనగర్ కాలనీకి చెందిన షేక్ లతీఫ్



లను అరెస్ట్ చేయగా నల్గొండ రవీంద్ర నగర్ చెందిన బంటు కార్తీక్ పరారులో ఉన్నట్లు తెలిపారు. శనివారం నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ చెందిన ఎస్సై సైదులు కానిస్టేబుల్ ఎస్ బాలకోటి ఎండి షకిల్లతో కలిసి హౌసింగ్ బోర్డు కాలనీలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటల సమయంలో నలుగురు వ్యక్తులు రెండు బైకులపై అక్కడ అనుమానాస్పదంగా నిలబడి ఉండగా వారిని విచారించేందుకు ప్రయత్నించగా పారిపోవడానికి ప్రయత్నించారని తెలిపారు వెంటనే పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా బంటు కార్తీక్ అనే వ్యక్తి గంజాయిని ఇతర ప్రాంతాల నుండి కొనుగోలు చేసి వీరికి సరఫరా చేస్తున్నట్లు తెలిపారని తెలిపారు. నిందితులు స్వయంగా గంజాయి సేవించడమే కాకుండా చిన్న చిన్న ప్యాకెట్లు తయారుచేసి ఒక్కో ప్యాకెట్ను 500 రూపాయలకు విక్రయిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నట్లు డిఎస్పి తెలిపారు ఈ క్రమంలో గంజాయిని విక్రయించడానికి హౌసింగ్ బోర్డ్ కాలనీ వచ్చిన సమయంలో పోలీసులు వారిని పట్టుకున్నట్లు తెలిపారు కేసును డి.ఎస్.పి పర్యవేక్షణలో నల్గొండ సిఐఎస్ రాఘవరావు ఆధ్వర్యంలో ఎస్సై సైదులు సిబ్బంది బాలకోటి షకిల్ చేదించగా ఎస్పీ వారిని అభినందించారు

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

* రైతు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి.

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు.సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ కోరారు. కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనలు ఆదేశాల మేరకు సంబంధిత అంశాలపై పకడ్బందీగా ముందుకెళ్తామన్నారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు.సెన్సెస్ పై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు గూగుల్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత,విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఈ ఈ అరుణ్ కుమార్, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, సిపిఓ శ్రీనివాసరావు,డి.ఎస్ఓ రమేష్, డి ఎం సప్లై సివిల్ సప్లై నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# చేపల పెంపకం యాజమాన్య పద్ధతులు అను అంశంపై మూడు రోజుల శిక్షణా విజయవంతం

పాలేరు, ప్రజా స్ఫూర్తి: మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి సహకారంతో, భారతీయ వ్యవసాయ మరియు పరిశోధన మండలి,న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో,తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్ , షెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్య కారులకు జరుగుతున్న జలాశయాలలో చేపల పెంపకం , యాజమాన్య పద్ధతులు అను అంశంపై శనివారం పాలేరులో మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం మూడు వ రోజు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ , ఖమ్మం జిల్లాల నుంచి 25 మంది మత్స్య కారులు హాజరైనారు. ఈరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బానోతు నాగేశ్వరావు నాయక్, పాలేరు సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ మత్స్యకారులు , మత్స్య రైతులు ఆక్వాకల్చర్ రంగంలో ముందుకు రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సబ్సిడీ పథకాలతో పాటు బ్యాంకులలో రైతులకు ఉండే వివిధ పథకాలు మరియు లోన్లను కూడా ఉపయోగించుకొని ఆక్వా రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. డాక్టర్ ఎం. శ్యాం ప్రసాద్ సీనియర్



మత్స్య శాస్త్రవేత్త మరియు అధిపతి మత్స్య పరిశోధన స్థానం పాలేరు వారు మాట్లాడుతూ జలాశయాలలో చేపల పెంపకం మరియు యాజమాన్య పద్ధతుల మీద ఇక్కడ నేర్చుకున్న ప్రతి విషయాన్ని మన తెలంగాణ మత్స్య రైతులు ఆచరణలో పెట్టి మంచి లాభాలని పొందాలని కోరారు అలాగే ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశాన్ని మీ తోటి సహచరులకు మిత్రులకు కూడా తెలియపరచాలని కోరారు. బి.రవీందర్ మత్స్య శాస్త్రవేత్త నీటి నాణ్యత ప్రమాణాలు, యాజమాన్యం అను అంశం పై మాట్లాడుతూ నీటి నాణ్యత ప్రమాణాలు ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటాయని అవి భౌతిక మరియు రసాయనిక ప్రమాణాలు, వీటిని కావలసిన మోతాదులో ఉంచుకున్నట్లయితే మన చేపల చెరువులకు ఎలాంటి రోగాలు రాకుండా జాగ్రత్తపడవచ్చని తెలిపారు.అదేవిధంగా నీటి నాణ్యత ప్రమాణాలను వివిధ రకాల రసాయనాలు వాడి ఏ విధంగా నిర్వహించాలో క్లుప్తంగా మన తెలంగాణ మత్స్యకారులకు వివరించారు.శ్రీ జి శ్రీనివాస్ రావు బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ ఆత్మ అశ్వరావుపేట్ డివిజన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు మాట్లాడుతూ చేప పిల్లల ఎంపికలో మరియు రవాణాలో పాటించవలసిన మెలకువలను గురించి మత్స్యకారులకు సంక్షిప్తంగా వివరించారు.శ్రీ సిగ నాగరాజు యంగ్ ప్రొఫెషనల్, మత్స్య పరిశోధన స్థానం పాలేరు వారు మాట్లాడుతూ చెరువులలో చేపలకు సర్వసాధారణంగా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి మరియు వాటి నివారణ మార్గాల గురించి తెలంగాణ మత్స్య రైతులకు క్లుప్తంగా వివరించారు. బానోతు దివ్య, యంగ్ ప్రొఫెషనల్, మత్స్య పరిశోధన స్థానం పాలేరు వారు మాట్లాడుతూ నాస్పాడ్ రిపోర్ట్ ఫిష్ డిసీజ్ యాప్ యొక్క విశిష్టతను తెలుపుతూ ఆ యాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు మరియు యాప్ ని డౌన్లోడ్ చేపించి చేపల వ్యాధులను ఎలా నివారించాలో క్లుప్తంగా వివరించడం జరిగింది.చివరిగా ప్రశంస పత్రాలను తెలంగాణ మత్స్యకారులకు అందించారు.

# మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

* తిరుమలాయపాలెం క్లస్టర్ ప్రజా దర్బార్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




ప్రజా స్ఫూర్తి , పాలేరు:తిరుమలాయపాలెం మండలంలో ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితిలోపు పరిష్కరించేలా పక్కా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన సభల్లో 14,700 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్ కోరుతూ వచ్చినవేనని పేర్కొన్నారు. తక్షణమే పరిష్కరించే వీలున్న వాటిని స్పాట్‌లోనే పూర్తి చేస్తున్నామని, మిగిలిన వాటిని మూడు నెలల గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్లు**

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.


**ధరణి చిక్కుముడులకు 'భూ భారతి'**

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తప్పుల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి విమర్శించారు. ఒకే సర్వే నంబర్‌లోని కొంత భూమి సేకరణ జరిగితే.. మొత్తం నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వంటి అవకతవకలను సరిదిద్దడానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని వివరించారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ధాన్యం కొనుగోళ్లపై భరోసా**

రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తిస్థాయిలో సేకరిస్తామని తెలిపారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీని అమలు చేశామని చెప్పారు. గతంలో రైతులపై బేడీలు వేసిన వారు నేడు కొనుగోలు కేంద్రాల వద్ద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం విజయవంతం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : చిల్‌పూర్ మండలంలోని లింగంపల్లి లో ప్రొఫెసర్ జయ శంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ , వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బి.సౌందర్య రైతులకు వరి రకాలు , యాజమాన్య పద్ధతులు, యూరియా వినియోగం తగ్గింపు, నేల ఆరోగ్యపరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి ఆదా పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే పంటల మార్పిడి, సేంద్రీయ వ్యవసాయం, సమగ్ర చీడపీడల నివారణ ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విద్యార్థులు, , రైతులు పాల్గొన్నారు.


# 'బేటీ బచావో' కేవలం నినాదానికే పరిమితమా?: మోదీకి కేటీఆర్ ప్రశ్న



బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'బేటీ బచావో' కేవలం నినాదానికే పరిమితమా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మైనర్ బాలికకు వేధింపుల ఆరోపణల నేపథ్యంలో, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని ప్రధానిని ప్రశ్నించారు. కేంద్రమంత్రి తనయుడు కాబట్టి ఆయనకు మినహాయింపు ఉంటుందా అని నిలదీశారు. కుమారుడిపై వచ్చిన ఆరోపణలకు గాను, బండి సంజయ్‌ను మంత్రి వర్గం నుంచి ఎప్పుడు బర్తరఫ్ చేస్తారని ప్రశ్నించారు. ఇదే అంశంపై ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా విమర్శలు గుప్పించారు. తెలంగాణలో మీ పార్టీ 'జంగిల్ రాజ్' ఎలా నడుపుతుందో చూడాలని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. ఒక మైనర్ బాలిక పూర్తి ఆధారాలతో వస్తే, పోలీసు శాఖ వేగంగా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇతర పోక్సో నేరస్తుల మాదిరిగానే బండి సంజయ్ కుమారుడిపై ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంలో తిరిగి మైనర్ బాలికపై కేసు పెట్టడమేమిటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలబడతారా అని ప్రశ్నించారు. బీజేపీకి తెలంగాణ కాంగ్రెస్ ఒక ఫ్రాంచైజీలా పనిచేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. మైనర్ బాలిక విషయంలో కాంగ్రెస్, బీజేపీలు ఒక అపవిత్రమైన, అసహ్యకరమైన ఒప్పందానికి వచ్చాయా అని ధ్వజమెత్తారు. పదిహేడేళ్ల బాధితురాలు, ఆమె కుటుంబం ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడానికి మూడు నెలలకు పైగా ఎందుకు పోరాడాల్సి వస్తోందని ప్రశ్నించారు. మైనర్ బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసిందని అన్నారు. న్యాయం కోసం మూడు నెలలుగా తిరుగుతున్నప్పటికీ వారిని పట్టించుకోలేదని విమర్శించారు. ఆడబిడ్డల రక్షణ కోసం ప్రభుత్వంతో కూడా ఎంతవరకైనా పోరాడుతామని హెచ్చరించారు.



## విషాదం.. అమెరికాలో తెలుగు యువతి మృతి



అమెరికాలో స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ఓ తెలుగు యువతి ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర విషాదం రేపింది. వర్జీనియాలో నివాసముంటున్న వీణ అనే యువతి మరణంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రెండు రోజుల క్రితం ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు ఫ్లోరిడా వెళ్లిన ఆమె.. అక్కడే స్విమ్మింగ్ పూల్ వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వీణ తల్లిదండ్రులు దేవేందర్ రెడ్డి,సునీత ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ డివిజన్‌లో నివాసం ఉంటున్నారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమార్తె మరణ వార్తతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాదం గురించి తెలుసుకున్న ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నేరుగా వీణ తల్లిదండ్రులు ఉంటున్న నివాసానికి వెళ్లారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీణ భౌతిక కాయాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆ కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.

## కారు, పాఠశాల బస్సు ఢీ
### ప్రభుత్వ వైద్యుడి దుర్మరణం




కల్వకుర్తి న్యూటౌన్: కారు, ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొన్న ప్రమాదంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయచూర్ కోదాడ జాతీయరహదారిపై కల్వకుర్తి మండల పరిధిలోని సీబీఎం కళాశాల వద్ద శనివారం ఉదయం కారు, ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ప్రభుత్వ వైద్యుడు విజయ్ కుమార్ (43) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కల్వకుర్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సమీపంలోని వందేమాతరం ఫౌండేషన్ ఆవరణలో వ్యాయామం చేసేందుకు వెళ్లి, తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య యశ్వంత్ రాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. యశ్వంత్ రాణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన విజయ్ కుమార్ గత మూడేళ్లుగా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. అతని మృతికి పలువురు వైద్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు.



## మస్కట్ నుంచి స్వదేశానికి చేరుకున్న షహనాజ్.. పవన్‌కు కృతజ్ఞతలు


మదనపల్లె క్రైమ్: మస్కట్‌లో చిత్రహింసలకు గురై స్వదేశానికి చేరుకున్న షహనాజ్ అనే మహిళ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మదనపల్లె ఎస్పీ, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి చెందిన షహనాజ్ ఉపాధి నిమిత్తం మస్కట్‌కు వెళ్లారు. అక్కడ సేఠ్ పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక ఏడుస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అందులో 'పవనన్నా.. నన్ను చంపేస్తారన్నా.. ప్లీజ్ కాపాడన్నా' అంటూ వేడుకున్నారు. స్పందించిన పవన్.. షహనాజ్‌ను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. విదేశాంగ శాఖ, దౌత్య కార్యాలయాల అధికారులతో డిప్యూటీ సీఎం కార్యాలయం సంప్రదింపులు జరిపింది. పవన్, అధికారుల చొరవతో షహనాజ్ శుక్రవారం స్వస్థలానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెతో పాటు కుటుంబసభ్యులు శనివారం మదనపల్లెలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ దళారుల మాటలు నమ్మి విదేశాలకు వెళ్లి ఎవరూ మోసపోవద్దని సూచించారు.

## ప్రధాని పర్యటనకు 2,620 మందితో భద్రత: మల్కాజిగిరి సీపీ సుమతి



హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటన కోసం 2,620 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి తెలిపారు. ఆక్టోపస్, ఇంటెలిజెన్స్, ఐటీ సెల్, షీటీమ్స్, బాంబ్ నిర్వీర్యదళం, స్నిఫర్‌డాగ్ తదితర బృందాలు విధుల్లో పాల్గొంటాయని, ప్రతి ఒక్కర్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే సభా ప్రాంగణం లోపలికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా సభకు వచ్చేవారి కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశామని, ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు క్యూఆర్ అందుబాటులో పెట్టామని, దాన్ని స్కాన్ చేస్తే ఎక్కడి నుంచి ఎలా వెళ్లాలో పూర్తి వివరాలు వస్తాయని తెలిపారు. శనివారం మారేడ్‌పల్లిలోని మల్కాజిగిరి డీసీపీ కార్యాలయంలో కమిషనర్ విలేకర్లతో మాట్లాడారు. "ప్రధాని బందోబస్తులో ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, 21 మంది ఏసీపీలు, 61 ప్రొబేషనరీ డీఎస్పీలు, 57 మంది ఇన్‌స్పెక్టర్లు, 226 మంది ఎస్సైలు, 1045 ఇతర సిబ్బంది విధుల్లో ఉంటారు. వీరితో పాటు 12 బెటాలియన్ ప్లటూన్లు, 6 ఏఆర్ ప్లటూన్లు, 620 మంది ట్రాఫిక్ పోలీసులు పాల్గొంటారు. వ్యూహాత్మక ప్రాంతాల్లోని విస్తృత నిఘాతో పాటు జనాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేశాం. సభ జరిగే ప్రాంతం, పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన జంక్షన్లు పూర్తిగా సీసీటీవీ నిఘాలో ఉంటాయి. పరేడ్‌గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రానికి వీటిని అనుసంధానించి పర్యవేక్షిస్తాం. మొత్తం 12 పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపాలి. సభ సమీపంలోకి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను అనుమతించం. సభ నేపథ్యంలో పార్కింగ్‌కు ఇబ్బందుల్లేకుండా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తాం" అని కమిషనర్ వివరించారు.

## తెలంగాణలో పర్యటన.. ప్రధాని మోదీకి కవిత బహిరంగ లేఖ



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేడు (మే 10) తెలంగాణలో పర్యటించనున్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రం, ప్రజల ప్రయోజనాలు, దేశంలో సామాజిక న్యాయ సాధనకు సంబంధించిన నాలుగు కీలక అంశాలను తక్షణమే పరిగణలోకి తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజలకు, భారతదేశంలో విస్తృత సామాజిక న్యాయ సాధనకు అత్యంత కీలకమైన నాలుగు విషయాలను ఒక బాధ్యత కలిగిన పౌరురాలిగా మీ దృష్టికి తీసుకువస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల నీటి పారుదల పథకానికి జాతీయహోదా కల్పించాలని కోరారు. 2027 జనాభా లెక్కలలో ప్రత్యేక ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఓబీసీ ఉప కోటాతో మహిళా రిజర్వేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు. తెలంగాణలో వెనుకబడిన తరగతుల బిల్లులకు రాష్ట్రపతి ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని ఆ లేఖలో కోరారు. జలభద్రత, డేటా ఆధారిత న్యాయం, లింగ సమానత్వం, రాజ్యాంగ రక్షణలు అనే నాలుగు మూలస్తంభాలను పరిష్కరించడం మన దేశ సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడంలో ఎంతగానో దోహదపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. తాను సూచించిన అభ్యర్థనలపై సానుకూలంగా పరిశీలిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భూముల ధరల సవరణ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల పనివేళలపై
# మంత్రి పొంగులేటి ఆదేశం



హైదరాబాద్: తెలంగాణలో భూముల ధరలను సవరించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అలాగే పనివేళలు సవరించాలని కూడా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్లకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక రద్దీ ఉన్న చంపాపేట, సరూర్ నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, షాద్ నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, ఫరూఖ్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు పని వేళలను 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు చెప్పారు. ఈ 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవసరమైతే మరింత సమయాన్ని పెంచుతామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని పెంచాలని సూచించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలను సమన్వయం చేసుకోవాలని మంత్రి అన్నారు.

## ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేస్తున్నప్పుడు, బీసీలను ఎందుకు విస్మరిస్తున్నారు?: వీహెచ్



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు బీసీ కులగణన డిమాండ్‌తో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ రేపటి తెలంగాణ పర్యటనను లక్ష్యంగా చేసుకుని వీహెచ్ ఈ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కోసం ప్రత్యేకంగా ఒక కాలమ్‌ను చేర్చాలని, వారి జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలని వీహెచ్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేస్తున్నప్పుడు, బీసీలను ఎందుకు విస్మరిస్తున్నారని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. బీసీలకు కూడా ఉద్యోగ, విద్యా రంగాల్లో సరైన వాటా దక్కాలని స్పష్టం చేశారు. బీసీల కులగణనపై స్పష్టమైన నిర్ణయం తీసుకున్న తర్వాతే ప్రధాని మోదీ తెలంగాణలో అడుగుపెట్టాలని ఆయన అల్టిమేటం ఇచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీలకు సబ్‌కోటా కేటాయించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు ఈ విషయంపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పర్యటించి బీజేపీ తీరును ఎండగడతానని ఆయన హెచ్చరించారు.

## నిన్న రాత్రి మూసీలో పడిపోయిన మహిళను కాపాడిన హైడ్రా సిబ్బంది

హైదరాబాద్: అంబర్‌పేట, గోల్నాక సమీపంలో మూసీలో పడిన ఓ మహిళను హైడ్రా కాపాడింది. మహిళను తమ సిబ్బంది కాపాడినట్లు హైడ్రా 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది. ఈరోజు ఉదయం 10.51 గంటలకు హైడ్రా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ వచ్చిందని, పదహారు నిమిషాల్లోనే అంటే, 11:07 గంటలకు హైడ్రా బృందాలు అక్కడకు చేరుకున్నట్లు తెలిపింది. అంబర్‌పేట్ సమీపంలోని గోల్నాక, భాగ్యనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇందిర (49) శుక్రవారం రాత్రి మూసీలో పడిపోయింది. ఆ సమీపంలో ఒడ్డుకు చేరే అవకాశంలేని చోట, చెట్లు అడ్డం ఉన్నచోట మూసీలోకి ఆమె జారి పడింది. రాత్రంతా ఆమె మూసీలోనే భయం భయంగా గడిపింది. కేకలు వేసినా ఎవరికీ వినపడలేదు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత స్థానికులు గుర్తించారు. బయటకు తీయడానికి అవకాశం లేకపోవడంతో హైడ్రా కంట్రోల్ రూమ్ 90001 13667 నెంబర్‌కు ఫోన్ చేసి స్థానికులు సమాచారం ఇచ్చారు. స్వామి (డీఆర్ఎఫ్ రెస్క్యూ ఇన్‌ఛార్జ్) టీమ్ 16 అంబర్‌పేట్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. హైడ్రా సహాయక చర్యలు జరుగుతుండగానే ఫైర్ సిబ్బంది కూడా అక్కడకు చేరుకున్నారు. పెద్ద నిచ్చెన సహాయంతో డీఆర్ఎఫ్ బృందం సభ్యులు కిందకు దిగి మూసీలో ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న మహిళను కాపాడారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులు, స్థానిక పోలీసులకు అప్పగించారు. పొరపాటున జారి పడిపోయినట్టు ఆమె చెప్పారు. తనకు భర్త లేదని, ఇద్దరు పిల్లలతో సమీపంలోనే ఉంటున్నట్లు ఆమె చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను హైడ్రా సిబ్బంది రక్షించిన తీరును స్థానికులు అభినందించారు.

# విజయ్-వీసీకే పొత్తు కుదిరినట్లేనా? పళనిస్వామి కీలక పోస్ట్



తమిళనాడులో రాజకీయ పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి ఇంకా తొలగిపోలేదు. ఈ సందిగ్ధం వేళ అన్నాడీఎంకే నేత పళనిస్వామి పోస్ట్ వైరల్‌గా మారింది. పార్టీ పేరు ప్రస్తావించకుండా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోయే పార్టీకి ఆయన అభినందనలు తెలిపారు. ''అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయి. వివిధ పార్టీల అభ్యర్థులు పోటీ చేసి విజయం సాధించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే పార్టీకి నా హృదయపూర్వక అభినందనలు'' అని పళనిస్వామి పేర్కొన్నారు. దీంతో విజయ్‌వీసీకే పొత్తు ఖాయమైందంటూ ప్రచారం జరుగుతోంది. మరోవైపు నేడు విజయ్ మరోసారి గవర్నర్‌ను కలవనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం తొలగే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల వెలువడిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు.. తొలుత కాంగ్రెస్, తాజాగా సీపీఐ, సీపీఎంతో పాటు వీసీకే పార్టీలు మద్దతు తెలపడంతో మెజార్టీ మార్కును చేరుకున్నట్లయింది. అయితే వీసీకే అధికారికంగా లేఖ ఇవ్వకపోవడం వల్ల ఈ సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది.

**నేడు కేరళ వెళ్లనున్న గవర్నర్..**

తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ మరోసారి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కోరనున్నారు. ఇప్పటికే మూడుసార్లు గవర్నర్‌ను విజయ్ కలిశారు. ఈక్రమంలో మ్యాజిక్ నంబర్ లేదని.. తగిన సంఖ్యా బలంతో రావాలని ఆయన సూచించారు. అయితే ఆర్లేకర్ నేటి సాయంత్రం 7.10 గంటలకు తిరువనంతపురం వెళ్లనున్నట్లు లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. ఈలోపు విజయ్ ఆయనను కలిసే అవకాశం ఉంది. ఆర్లేకర్ కేరళ గవర్నర్‌గా ఉంటూ.. తమిళనాడు అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.



# ముగిసిన కీలక సమావేశం..
## కేరళ సీఎం పదవిపై కొనసాగుతున్న సస్పెన్స్

దిల్లీ/ తిరువనంతపురం: తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆదివారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పర్యటించిన ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు శుక్రవారం నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం 4 గంటలకు ఖర్గే నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి రాహుల్ గాంధీ, కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్, సీఎం పదవి రేసులో ఉన్న వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల హాజరయ్యారు. కీలక సమావేశం ముగిసిన అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రండి భాజపాపై కలిసి పోరాడుదాం.. విపక్షాలకు మమత పిలుపు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. భాజపాను వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘాలు, ఎన్జీఓలు కూడా తమకు మద్దతు తెలపాలని కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించగా, ఆ పార్టీ నేత సువేందు అధికారి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా తన నివాసం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ''భాజపాను వ్యతిరేకించే వామపక్షాలు, ప్రతిపక్షాలతో పాటు జాతీయ



పార్టీలు కలిసి రావాలి. శత్రువుకు శత్రువు మిత్రుడు అని ఆలోచించే సమయం కాదు ఇది. మనందరి మొదటి శత్రువు భాజపానే. కొన్ని దుష్ట శక్తులు (భాజపాను ఉద్దేశించి) రాష్ట్రంలోకి ప్రవేశించాయి. గూండాయిజం చేస్తున్నాయి. టీఎంసీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ అగ్రనాయకులతో పాటు ఇతర పార్టీ నాయకులు నాతో సంభాషించారు. ఎవరి సానుభూతిని కోరుకోవడం లేదు. ఈ యుద్ధంలో ఎవరు గెలుస్తారన్నది భవిష్యత్తు నిర్ణయిస్తుంది. ఈ ఎన్నికల్లో టీఎంసీ పార్టీకి ద్రోహం జరిగింది'' అని మమత ఆరోపించారు. రాజకీయ పార్టీలతో పాటు విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు కూడా తమతో చేతులు కలపాలని, అందరం కలిసి భాజపాను ఎదుర్కోవాలని ఆమె పిలుపునిచ్చారు.

# మా పార్టీలో ఏక్‌నాథ్ శిందేలు లేరు: సీఎం కీలక వ్యాఖ్యలు


శ్రీనగర్, మే 09: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఫిరాయింపులకు అవకాశమే లేదంటూ ప్రతిపక్ష భాజపాకు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే పేరును ప్రస్తావించారు. ఇటీవల జమ్మూకశ్మీర్ (Jammu and Kashmir) అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సునీల్ శర్మ మాట్లాడుతూ.. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఆ పార్టీలో చాలామంది ఏక్‌నాథ్ శిందేలు ఉన్నారని వ్యాఖ్యలు చేశారు. వారు పార్టీ నుంచి విడిపోవడానికి సిద్ధంగా ఉన్నారని, ఆ అసమ్మతి భయంతోనే ఒమర్ క్యాబినెట్‌ను విస్తరించలేకపోతున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలకు తాజాగా ఒమర్ బదులిచ్చారు. ''మా ఎమ్మెల్యేలు అంతా కలిసికట్టుగా ఉన్నారు. అసమ్మతితో భాజపాలో చేరేవారు ఎవరూ లేరు. ప్రతిపక్ష నేత చేసిన వ్యాఖ్యలు భాజపా ఉద్దేశాన్ని వెల్లడిస్తున్నాయి. భాజపా సహాయంతోనే ఏక్‌నాథ్ శిందే అలా చేశారు. ఆయన జమ్మూకశ్మీర్‌లో ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలని తహతహలాడుతున్నట్లు కనిపిస్తోంది. కానీ మా పార్టీలో శిందేలు లేరు'' అని ఒమర్ పేర్కొన్నారు. 2022 జూన్‌లో ఏక్‌నాథ్ శిందే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలతో ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంపై తిరుగుబాటు చేయడంతో శివసేన రెండుగా చీలిపోయిన సంగతి తెలిసిందే. దాంతో అప్పుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే ఆ పదవికి రాజీనామా



చేయాల్సివచ్చింది. అప్పటినుంచి పార్టీల్లో తిరుగుబాటు నేతలను ఉద్దేశించి మాట్లాడేటప్పుడల్లా శిందే పేరు ప్రస్తావనకు వస్తోంది.

## తదుపరి సీడీఎస్‌గా
# ఎన్ఎస్ రాజా సుబ్రమణి నియామకం

న్యూఢిల్లీ, మే 9: నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS)గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్ ఎస్ రాజా సుబ్రమణి (రిటైర్డ్)ని ప్రభుత్వం నియమించింది. భారత సైనిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం సీడీఎస్‌గా ఉన్న జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం మే 30తో ముగియనున్న నేపథ్యంలో



ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు జనరల్ రాజా సుబ్రమణి ఆ పదవిలో కొనసాగనున్నారు. మరోవైపు చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నియమితులయ్యారు. మే 31న బాధ్యతలు స్వీకరించి డిసెంబర్ 31, 2028 వరకూ ఆ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం ఆయన వెస్టర్న్ నావల్ కమాండర్‌గా విధుల్లో ఉన్నారు.

# మోదీ పీఎం అయ్యాక.. 9 రాష్ట్రాల్లో తొలిసారి భాజపా ముఖ్యమంత్రులు


పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ 15 ఏళ్ల పాలనకు భాజపా (BJP) చెక్ పెట్టింది. 2014లో నరేంద్ర మోదీ (PM Narendra Modi) ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాషాయ జెండాలు రెపరెపలాడాయి. 2014లో హరియాణా, మహారాష్ట్రలతో ప్రారంభమైన భాజపా విజయ ప్రయాణం..ఆ తర్వాత అస్సాం (2016), అరుణాచల్ ప్రదేశ్ (2016), మణిపుర్ (2017), త్రిపుర (2018), ఒడిశా (2024), బిహార్ (2026) నుంచి బెంగాల్‌కు చేరింది.



- 2014లో ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజపా మొదటిసారి హరియాణాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, మనోహర్ లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది.
- 2016 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించి.. మహాయుతి కూటమిలోని మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో దేవేంద్ర ఫడణవీస్ మహారాష్ట్రకు తొలి భాజపా ముఖ్యమంత్రి అయ్యారు.
- 2016లో అస్సాంలో విజయం సాధించి ఈశాన్య ప్రాంతంలో భాజపా తన ప్రాబల్యాన్ని విస్తరించుకుంది. సర్బానంద సోనోవాల్ భాజపా తొలి ముఖ్యమంత్రి అయ్యారు. అనంతరం వరుసగా జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది.
- 2016లో అరుణాచల్‌లో జరిగిన పలు నాటకీయ పరిణామాల తర్వాత భాజపా తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2016 జులైలో కాంగ్రెస్ నేత పెమా ఖండూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్‌లో ఆయన తన 33మంది ఎమ్మెల్యేలతో కలిసి భాజపా మిత్రపక్షమైన పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ (PPA)లో చేరారు. అనంతరం ఆ పార్టీ భాజపాలో విలీనం అవ్వడంతో 2016 డిసెంబర్‌లో సుస్థిర భాజపా ప్రభుత్వం ఏర్పడింది. పెమా ఖండూ సీఎంగా కొనసాగుతున్నారు.
- 2017లో మణిపుర్ ఎన్నికల అనంతరం నేషనల్ పీపుల్స్ పార్టీ (NPP), నాగా పీపుల్స్ ఫ్రంట్ (NPF) ఇతర ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకొని భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీరెన్ సింగ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు.
- 2018 ఎన్నికల్లో త్రిపురలోని లెఫ్ట్ ఫ్రంట్ దశాబ్దాల సుదీర్ఘ పాలనకు తెరదించి కాషాయ పతాకాన్ని ఎగరేసింది. బిప్లబ్ కుమార్ దేబ్ నేతృత్వంలో తొలి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- 2024లో ఒడిశాలో జరిగిన ఎన్నికల్లో బిజు జనతా దళ్‌ను ఓడించి తూర్పు భారతదేశంలోనూ మరో ముందడుగు వేసింది. మోహన్ చరణ్ మాఝీ భాజపా తొలి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు.
- 2025 బిహార్ ఎన్నికల్లో భాజపా ఎన్డీఏ మిత్రపక్షమైన జేడీయూ సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నీతీశ్ ఈ ఏడాది ప్రారంభంలో రాజ్యసభకు వెళ్లారు. దీంతో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న భాజపా నేత సమ్రాట్ చౌధరీ ముఖ్యమంత్రి అయ్యారు.
- ఇటీవల (2026) పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో భాజపా భారీ విజయాన్ని సాధించింది. రాష్ట్రంలో తొలి భాజపా ముఖ్యమంత్రిగా సువేందు అధికారి బాధ్యతలు చేపట్టారు.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ కోసం.. సీక్రెట్ రీడింగ్ రూమ్..!

న్యూయార్క్, మే 9: ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌కు సంబంధించిన ఫైళ్లన్నీ ఓ లైబ్రరీ ద్వారా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. దీనికి సంబంధించి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఒక రీడింగ్ రూమ్‌ను ఏర్పాటుచేశారు. ఆ నగరం సమీపంలోని ట్రైబెకా ప్రాంతంలో వాటిని ప్రదర్శనకు ఉంచారు. మే 8 నుంచి 21 వరకు ప్రజలు వీటిని చదవడానికి వీలు ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ రాకెట్‌కు సంబంధించిన 3.5 మిలియన్ల ఫైళ్లను దశలవారీగా అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రైమరీ ఫ్యాక్ట్స్ అనే ఎన్జీఓ ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసింది. 3,700 వాల్యూమ్స్‌లో 'డొనాల్డ్ జె.ట్రంప్ అండ్ జెఫ్రీ ఎప్‌స్టీన్ మెమోరియల్ రీడింగ్ రూమ్' పేరిట వాటిని అందుబాటులో ఉంచింది. అపాయింట్‌మెంట్ తీసుకున్నవారే



ఈ రీడింగ్ రూమ్‌కు వెళ్లడానికి వీలు ఉంటుంది. భద్రతా కారణాలతో నిర్వాహకులు ఈ గ్యాలరీ అడ్రెస్‌ను రహస్యంగా ఉంచారు. ట్రంప్, ఎప్‌స్టీన్ల మధ్య సంబంధాలు ఎప్పుడు మొదలై, ఎప్పటివరకు కొనసాగాయో కూడా ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారట. ఎప్‌స్టీన్ వర్గం చేసిన నేరాలు, వాటిని కప్పిపుచ్చడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాల నుంచి ప్రజల దృష్టి మళ్లకుండా చేసేందుకే ఈ ఏర్పాటు అని ఎన్జీఓ వెబ్‌సైట్ పేర్కొంది. అలాగే న్యాయకోసం పోరాడుతున్న బాధితులకు మద్దతుగా నిలిచే ప్రయత్నమని రాసుకొచ్చింది.

# ఇస్లామాబాద్ వేదికగా.. అమెరికా– ఇరాన్ మధ్య మరోసారి చర్చలు..!

వాషింగ్టన్/టెహ్రాన్, మే 9: పశ్చిమాసియాలో సంఘర్షణను ముగించడమే లక్ష్యంగా కీలక ముందడుగు పడింది. ఓ ఒప్పందానికి సంబంధించి అమెరికా ఇరాన్ మరోసారి చర్చలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు ఇరుదేశాల ప్రతినిధులు వచ్చేవారం రానున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. సంఘర్షణకు ముగింపు పలకడమే లక్ష్యంగా.. 14 పాయింట్ల అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఆ కథనాలు వెల్లడించాయి. ఇందులో ఇరాన్ అణు కార్యక్రమం, దానివద్ద ఉన్న యురేనియం నిల్వల బదిలీ, హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించడం వంటి కీలక విషయాలు ఉన్నాయి. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని టెహ్రాన్ ముందునుంచీ డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ చర్చలకు ఇవే అడ్డంకిగా మారాయి. కాగా.. చర్చలు సానుకూలంగా సాగితే ఇరుదేశాల మధ్య కొనసాగుతోన్న కాల్పుల విరమణ ఒప్పందం మరికొంతకాలం పొడిగించే అవకాశాలు కన్పిస్తున్నాయి.



ఇక, పశ్చిమాసియా సంఘర్షణ ముగించేందుకు తాము పంపిన ప్రతిపాదనలపై ఇరాన్ నుంచి నేడు స్పందన వచ్చే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే ఈ విషయాన్ని సాగదీస్తుందా అని విలేకరులు అడగ్గా.. త్వరలోనే మనకు దీని గురించి తెలుస్తుందన్నారు. హర్మూజ్‌లో చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా బయటకు తెచ్చేందుకు చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తిరిగి పునరుద్ధరించే విషయాన్ని తమ యంత్రాంగం పరిశీలిస్తుందని ట్రంప్ అన్నారు. ఇరాన్ త్వరగా ఒప్పందంపై సంతకం చేయకపోతే.. ఈ కార్యక్రమాన్ని 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'గా నిర్వహిస్తామన్నారు. నౌకలను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పాటు మరికొన్ని చర్యలను కూడా చేపడతామన్నారు.

# ఎట్టకేలకు ఓటమిని అంగీకరించిన మమతా బెనర్జీ

కోల్‌కతా, మే 9: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమతా బెనర్జీ.. ఎట్టకేలకు తన పరాజయాన్ని అంగీకరించారు. రాష్ట్రంలో భాజపా సర్కారు కొలువుదీరిన నేపథ్యంలో.. ఆమె తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమత.. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీఎం పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఆ తర్వాత మే 7వ తేదీతో అసెంబ్లీ గడువు పూర్తైన నేపథ్యంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి దానిని రద్దు చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. నేడు రాష్ట్ర సీఎంగా భాజపా నేత సువేందు అధికారి ప్రమాణం చేశారు. దీంతో దీదీ తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. 'అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి (15, 16, 17వ విధానసభ)' అని మార్చుకున్నారు. అంతకుముందు 'పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి' అని మాత్రమే ఉండేది.

## ఫ్లిప్‌కార్ట్ సేల్‌లో ఐఫోన్ ధర
# ఒక్కసారిగా రూ.25 వేలు డ్రాప్!

**ఫ్లిప్‌కార్ట్ సాసా లేలే సేల్‌లో ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై భారీ ఆఫర్**

**అన్ని ఆఫర్లు కలిపి మొత్తం రూ.25,000 వరకు తగ్గింపు**

**బ్యాంక్ ఆఫర్లతో కలిపి రూ.1,24,900కే ఫోన్ సొంతం చేసుకునే అవకాశం**

**మే 9 నుంచి ఈ సేల్ అందరికీ అందుబాటులో ఉంది**

**ఇతర ఐఫోన్ మోడళ్లపైనా ఆకర్షణీయమైన డిస్కౌంట్లు**



**న్యూఢిల్లీ:** ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ నిర్వహిస్తున్న 'సాసా లేలే' సేల్ ఇప్పుడు అందరు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది. ఈ సేల్‌లో భాగంగా ప్రీమియం స్మార్ట్‌ఫోన్లపై భారీ డిస్కౌంట్లు లభిస్తున్నాయి. ముఖ్యంగా, యాపిల్ ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై అన్ని ఆఫర్లతో కలిపి ఏకంగా రూ.25,000 వరకు తగ్గింపును ప్రకటించారు.

మే 9 నుంచి ఈ సేల్ అందరికీ లైవ్‌లో ఉండగా, ప్లస్ మరియు బ్లాక్ సభ్యులకు మే 8న ముందుగానే యాక్సెస్ లభించింది. ప్రస్తుతం ర్యామ్ కొరత కారణంగా స్మార్ట్‌ఫోన్ల ధరలు పెరుగుతున్న తరుణంలో ఈ ఆఫర్ ఐఫోన్ ప్రియులకు మంచి అవకాశంగా చెప్పవచ్చు.

ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ (256జీబీ బేస్ వేరియంట్) అసలు ధర రూ.1,49,900 కాగా, ఫ్లిప్‌కార్ట్ సేల్‌లో భాగంగా రూ.15,000 తక్షణ తగ్గింపుతో రూ.1,34,900కే లభిస్తోంది. దీనికి అదనంగా, ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ లేదా ఫ్లిప్‌కార్ట్ ఎస్‌బీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో పూర్తి చెల్లింపు చేస్తే మరో రూ6,000 ఆదా అవుతుంది. అదనపు బ్యాంక్ క్యాష్‌బ్యాక్ కింద మరో రూ.4,000 తగ్గింపు లభిస్తుంది. దీంతో అన్ని ఆఫర్లు కలిపి ఈ ఫోన్ ప్రభావవంతమైన ధర రూ.1,24,900కే వస్తుంది. అంటే, అసలు ధరపై మొత్తం రూ.25,000 ఆదా చేసుకోవచ్చు.

### ఫోన్ ఫీచర్లు మరియు పనితీరు

ఈ ఫోన్ 6.9-అంగుళాల భారీ డిస్‌ప్లేతో పాటు, కొత్త సిరామిక్ షీల్డ్ 2 రక్షణతో వస్తుంది. దీని యాంటీ-రిఫ్లెక్టివ్ కోటింగ్ ఎండలో కూడా స్క్రీన్‌ను స్పష్టంగా చూసేందుకు వీలు కల్పిస్తుంది. ఇందులో శక్తివంతమైన ఏ19 ప్రో చిప్‌సెట్‌ను ఉపయోగించారు. ఇది గేమింగ్‌లో కూడా సమర్థవంతమైన పనితీరును కనబరుస్తుంది.

వెనుక వైపు యాపిల్ ఫ్యూజన్ టెక్నాలజీతో కూడిన మూడు 48 మెగాపిక్సెల్ కెమెరాలు ఉన్నాయి. ఈ సేల్‌లో ఐఫోన్ 17, 16, 15 వంటి ఇతర మోడళ్లపై కూడా ఆకర్షణీయమైన డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి. ఆఫర్లు స్టాక్, సమయం మీద ఆధారపడి మారే అవకాశం ఉన్నందున, కొనుగోలుదారులు ఫ్లిప్‌కార్ట్ వెబ్‌సైట్‌లో తుది వివరాలను సరిచూసుకోవడం మంచిది.

## ఆడి, ఫెరారీలనే వెనక్కి నెట్టి.. ప్రపంచంలో మూడో శక్తిమంతమైన బ్రాండ్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్!

**టయోటా, బీఎండబ్ల్యూ తర్వాత స్థానం.. ఆడి, ఫెరారీ వెనక్కి**

**30 శాతం వృద్ధితో 1.2 బిలియన్ డాలర్లకు చేరిన బ్రాండ్ విలువ**

**ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల్లో విస్తరించిన కార్యకలాపాలు**

**టాప్-5లో నిలిచిన టాటా మోటార్స్.. జాబితాలో మహీంద్రా, మారుతీ**

**న్యూఢిల్లీ:** భారత మోటార్ సైకిల్ తయారీ దిగ్గజం రాయల్ ఎన్‌ఫీల్డ్ అంతర్జాతీయంగా మరో అరుదైన ఘనత సాధించింది. ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన ఆటోమోటివ్ బ్రాండ్‌గా నిలిచి, టయోటా మరియు బీఎండబ్ల్యూ తర్వాత స్థానాన్ని కైవసం చేసుకుంది. బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన "ఆటోమోటివ్ ఇండస్ట్రీ 2026" నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ క్రమంలో ఆడి (4వ స్థానం), ఫెరారీ (7వ స్థానం) వంటి గ్లోబల్ దిగ్గజాలను రాయల్ ఎన్‌ఫీల్డ్ వెనక్కి నెట్టడం విశేషం.

ఈ నివేదిక ప్రకారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బ్రాండ్ స్ట్రెంగ్త్ ఇండెక్స్ (బీఎస్ఐ)లో 100కి 88.9 స్కోర్‌తో పాటు "ఏఏఏ" రేటింగ్ పొందింది. అంతేగాక కంపెనీ బ్రాండ్ విలువ గత ఏడాదితో పోలిస్తే 30 శాతం పెరిగి 1.2 బిలియన్ డాలర్లకు చేరినట్టు నివేదిక పేర్కొంది. ఒకప్పుడు కేవలం రెట్రో బైక్‌ల తయారీదారుగా గుర్తింపు పొందిన ఈ సంస్థ, ఇప్పుడు గ్లోబల్ మార్కెట్‌లో తన ప్రభావాన్ని చాటుతోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రాయల్ ఎన్‌ఫీల్డ్ అంతర్జాతీయంగా వేగంగా విస్తరించడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ, 3,200కు పైగా రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తోంది. దీనికి తోడు ఏడు అంతర్జాతీయ సీకేడీ (సీకేడీ) అసెంబ్లీ ప్లాంట్లను ఏర్పాటు చేసి కీలక మార్కెట్లలో తన ఉనికిని బలోపేతం చేసుకుంది. యూరప్, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా వంటి ప్రాంతాల్లో తమ ఉత్పత్తులకు బలమైన డిమాండ్ ఉందని కంపెనీ తెలిపింది.

క్లాసిక్ స్టైలింగ్‌తో కూడిన సరళమైన ఇంజినీరింగ్ అనే తన కోర్ ఐడెంటిటీకి కట్టుబడి ఉండటమే రాయల్ ఎన్‌ఫీల్డ్ విజయం వెనుక ఉన్న మరో ముఖ్య కారణం. హంటర్ 350, సూపర్ మీటియోర్ 650 వంటి మోడళ్లు ప్రత్యేకమైన డిజైన్, సింపుల్ రైడింగ్ అనుభూతిని కోరుకునే వారిని ఆకట్టుకుంటున్నాయి. అదే సమయంలో, ఆధునికీకరించిన హిమాలయన్ 450 అడ్వెంచర్ విభాగంలో బ్రాండ్ అప్పీల్‌ను మరింత పెంచింది.

ఈ జాబితాలో రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో పాటు ఇతర భారతీయ ఆటో బ్రాండ్లు కూడా సత్తా చాటాయి. టాటా మోటార్స్ ఐదో స్థానంలో నిలవగా, మహీంద్రా 25వ, మారుతీ సుజుకి 34వ స్థానంలో ఉన్నాయి. ఇది భారత ఆటోమోటివ్ పరిశ్రమ ఎదుగుదలకు నిదర్శనంగా నిలుస్తోంది.

## అనిల్ అంబానీ కార్యాలయాల్లో సీబీఐ సోదాలు



**న్యూఢిల్లీ:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిపినట్లు తెలుస్తోంది. బ్యాంక్ మోసం కేసులో ముంబయిలోని ఆయనకు సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) శనివారం తెలిపింది.

కంపెనీల డైరెక్టర్ల నివాసాలు మధ్యవర్తిత్వం వహించిన సంస్థల కార్యాలయాల్లోనూ సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఒకే చిరునామా నుంచి పలు మధ్యవర్తి కంపెనీలు పనిచేస్తున్నట్లు గుర్తించామని.. దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై ఇప్పటికే ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీబీఐ ఇప్పటికే పలుమార్లు అనిల్ అంబానీ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది.

# రషీద్ స్పిన్‌కు రాజస్థాన్ 'బౌల్డ్'..

**రెండో స్థానంలో గుజరాత్..!**

**జైపూర్:** హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాల్ని మెరుగుపరచుకుంది. శనివారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై భారీ విజయంతో చెక్ పెట్టింది. ఓపెనర్లు గిల్ (84), సుదర్శన్(55) విధ్వంసంతో 229 రన్స్ కొట్టిన గుజరాత్ ఆపై రషీద్ ఖాన్(4-33)ల విజృంభణతో ఆతిథ్య జట్టును హడలెత్తించింది. రబడ(2-33) టాపార్డర్‌ను పడగొట్టగా.. మిస్టరీ స్పిన్నర్ రషీద్ మిడిల్ బ్యాటర్లను మడతపెట్టేశాడు. క్రీజులో నిలబడి ఆడేవారు కరువవ్వగా రాజస్థఆన్ 152కే ఆలౌటైంది. ఏడో విజయంతో





గుజరాత్ రెండో స్థానానికి దూసుకెళ్లింది.

పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ దూకుడు కొనసాగుతోంది. లీగ్ దశ ఆఖర్లో పుంజుకున్న గుజరాత్ ఈసారి రాజస్థాన్ రాయల్స్‌ను భారీ తేడాతో ఓడించింది. భారీ లక్ష్యాన్ని ముందుంచి ప్రత్యర్థిని భయపెట్టిన గుజరాత్ బౌలర్ల కృషితో పెద్ద విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు మెరుపు ఆరంభాలిస్తున్న ఓపెనర్ సూర్యవంశీ(36) దూకుడుగానే ఆడినా సిరాజ్ అతడి ఆట కట్టించాడు. ఆ తర్వాతి ఓవర్లో డేంజరస్ యశస్వీ జైస్వాల్(3)ని రబడ ఔట్ చేసి రాజస్థాన్‌కు షాకిచ్చాడు.

కాసేపటికే హిట్‌మైర్(6)ను సైతం వెనక్కి పంపిన రబడ రెండో వికెట్ సాధించాడు. ఆ తర్వాత జురెల్(24) జతగా రవీంద్ర జడేజా(38) బౌండరీలతో గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. కానీ, రషీద్ ఖాన్ (4-33) ఒకే ఓవర్లో జురెల్, ఫెరీరా(4)లను వెనక్కి పంపి రాజస్థాన్‌ను కష్టాల్లోకి నెట్టాడు. అంతేనా.. ఆ తర్వాతి ఓవర్లో జడేజాను పెవిలియన్ పంపి రాజస్థాన్ ఆశలపై నీళ్లు చల్లాడు. హోల్డర్ సైతం వికెట్ల వేటతో గుజరాత్ గెలుపు మరింత తేలికైంది. చివరి బ్యాటర్‌ను వెనక్కి పంపిన హోల్డర్ ప్రత్యర్థిని 152కే పరిమితం చేయగా.. గుజరాత్ 87 పరుగుల భారీ విజయాన్నందుకుంది.

### గిల్, సుదర్శన్ దంచగా

జైపూర్‌లో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శతక భాగస్వామ్యంతో రెచ్చిపోయారు. ఆతిథ్య రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికేసిన శుభ్‌మన్ గిల్(84), సాయి సుదర్శన్(55)లు అర్ధ శతకాలతో భారీ స్కోర్‌కు పునాది వేశారు. వీరిద్దరూ ఔటయ్యాక.. జోస్ బట్లర్(13), హోల్డర్(7) క్రీజులో నిలవలేదు. దాంతో, 118తో పటిష్టంగా కనిపించిన గుజరాత్ ఒక్కసారిగా 185/3కి చేరింది. అయినా.. సుందర్(37 నాటౌట్), తెవాటియా(14 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. డెత్ ఓవర్లలో ఈ ద్వయం దంచేయగా గుజరాత్ నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది.

## నాకు ఇవ్వాల్సిన ప్రైజ్‌మనీ ఎగ్గొట్టారు..

**న్యాయం చేయరూ..!**

**న్యూఢిల్లీ:** భారత గ్రాండ్‌మాస్టర్, అర్జున అవార్డు గ్రహీత అభిజిత్ గుప్తా తనకు న్యాయం చేయాలంటూ క్రీడామంత్రిత్వ శాఖను ఆశ్రయించాడు. ఒడిశా ఓపెన్ నిర్వాహకుల నుంచి తనకు రావాల్సిన ప్రైజ్‌మనీని ఇప్పించాలని అభిజిత్ కోరాడు. ఐదు నెలలు కావొస్తున్నా నిర్వాహకులు స్పందించడం లేదని వాపోయిన అభిజిత్.. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని క్రీడా మంత్రిత్వ శాఖకు విన్నవించుకున్నాడు.

ఒడిశా ఓపెన్-2026(పదహారో అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్ చెస్ ఫెస్టివల్) జనవరి 16 -24 మధ్య జరిగింది. ఈ టోర్నీలో అదరగొట్టిన అభిజిత్ గుప్తా విజేతగా అవతరించాడు. ఛాంపియన్‌గా నిలిచినందుకు అతడికి రూ.5.5 లక్షల నగదు బహుమతి దక్కాలి. కానీ, నిర్వాహకులు మాత్రం ఈ టోర్నీ ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. తనకు రావాల్సిన డబ్బుల గురించి అఖిల భారత చెస్ సమాఖ్యకు, ఒడిశా ఓపెన్ నిర్వాహకులకు అభిజిత్ పలు మార్లు లేఖలు రాసినప్పటికీ న్యాయం జరుగలేదు. దాంతో.. విసుగొచ్చిన అతడు క్రీడా మంత్రిత్వ శాఖను సంప్రదించాడు.


'ఒక క్రీడాకారుడిగా విజయాల కంటే ఓటములను అంగీకరించడం నేర్చుకుంటాం. ఇదంతా క్రీడలో భాగం. కానీ, టోర్నీలో గెలిచిన తర్వాత ప్రైజ్‌మనీ అందుకోకపనోవడం మరింతగా బాధిస్తుంది. ఈ ఏడాది జనవరిలో



నేను ఒడిశా ఓపెన్ గెలుపొందాను. ప్రైజ్‌మనీని నెల రోజుల్లో ఇస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు. నెల గడిచినా నాకు నగదు బహుమతి ఇవ్వలేదు. ఇదేంటీ? అని అడుగబోతే నిర్వాహకులు స్పందించడం లేదు. అఖిల భారత చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో టోర్నీ జరిగినందున ఏఐసీఎఫ్ అధ్యక్షుడు, సెక్రటరీలను సంప్రదించాను. కానీ, దురదృష్టవశాత్తూ వారు కూడా ఈ సమస్యను పరిష్కరించలేకపోయారు.

అర్జున అవార్డు గ్రహీతనైనా నాకు ఇలాంటి పరిస్థితి ఎదురవ్వడంతో.. నేను ఈ స్థాయికి రావడానికి పడిన కష్టాలు గుర్తుకొస్తున్నాయి. అందుకని నాకు రావాల్సిన ప్రైజ్‌మనీ ఇప్పించాల్సిందిగా కేంద్ర యువజన మంత్రిత్వ, క్రీడా శాఖను అభ్యర్థిస్తున్నా. నాకు చెల్లించని డబ్బుల గురించే కాదు.. భారత్‌లోని ప్రతి చెస్ క్రీడాకారుల గౌరవం, నమ్మకాన్ని కాపాడం గురించి అని నేను మీకు తెలియజేస్తున్నా' అని అభిజిత్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నాడు.

## రెజ్లర్ వినేశ్ పోగట్‌కు షోకాజ్ నోటీసులు జారీ



**న్యూఢిల్లీ:** రెజ్లర్ వినేశ్ పోగట్‌కు భారతీయ రెజ్లింగ్ సమాఖ్య షోకాజ్ నోటీసు జారీ చేసింది. క్రమశిక్షణారహిత్యానికి పాల్పడిందని, యాంటీ డోపింగ్ రూల్స్‌ను అతిక్రమించినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది జూన్ వరకు వినేశ్ ఎటువంటి టోర్నీల్లో పాల్గొనడానికి అర్హురాలు కాదని రెజ్లింగ్ సమాఖ్య పేర్కొన్నది. డబ్ల్యూఎఫ్ఐ 15 పేజీల నోటీసును జారీ చేసింది. వినేశ్ ప్రవర్తన వల్ల దేశానికి చెడ్డ పేరు వచ్చినట్లు ఆ నోటీసులో తెలిపారు. భారతీయ రెజ్లింగ్ వ్యవస్థ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసిందని, డబ్ల్యూఎఫ్ఐ నిబంధనలను ఆమె ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు.

నాలుగు తీవ్రమైన ఆరోపణలు చేసిన ఫెడరేషన్.. వాటిపై వినేశ్‌ను వివరణ కోరింది. 2024 ఒలింపిక్స్‌లో బరువు వల్ల అనర్హత, యాంటీ డోపింగ్ రూల్స్‌ను విస్మరించడం, 2024 మార్చి సెలక్షన్ ట్రయల్స్‌లో రెండు కేటగిరీల్లో పాల్గొనడం వంటి అంశాలపై వినేశ్ పోగట్ వివరణ ఇవ్వాలని రెజ్లింగ్ సమాఖ్య కోరింది. అయితే జూన్ వరకు వినోశ్ ఎటువంటి దేశీయ టోర్నీల్లో పాల్గొనడానికి అర్హురాలు కాదని సమాఖ్య చెప్పింది.

మే 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గోండాలో జరిగే నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో కూడా పాల్గొనేందుకు అనుమతి లేదని రెజ్లింగ్ సమాఖ్య చెప్పింది. షోకాజ్ నోటీసులపై పోగట్ 14 రోజుల్లోగా స్పందించాల్సి ఉంటుంది.

## ఔను.. ఫిట్‌నెస్ సమస్యలతో
# బాధ పడుతున్నా..!

**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచి 25వ గ్రాండ్‌స్లామ్ పట్టేయాలనుకున్న నొవాక్ జకోవిచ్ కల చెదిరేలా ఉంది. అందుకు కారణం సన్నాహక టోర్నీ ఇటాలియన్ ఓపెన్‌లో జకో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఊహించని పరాభవంపై జకోవిచ్ స్పందిస్తూ.. తనను శారీరక ఇబ్బందులు వేధిస్తున్నాయని అంగీకరించాడు. వయసు పైబడుతుండడం, ఫిట్‌నెస్ పరమైన సమస్యలను తాను కొట్టిపారేయడడం లేదని జకో వెల్లడించాడు.

'ఇటాలియన్ ఓపెన్‌కు బాగానే సన్నద్ధమయ్యాను. నిజాయతీగా చెప్పాలంటే నేను ఒక టోర్నీలో శారీరక ఇబ్బందులు పడినది గుర్తుకు లేదు. కానీ, ఇప్పుడు ఫిట్‌నెస్ సమస్యలు నన్ను వెంటాడుతున్నాయనేది కాదనలేని నిజం. ఇది ఒకరకంగా చాలా చిరాకు తెప్పిస్తోంది. కానీ, ఇలాంటి పరిస్థితుల్లోనూ నేను టెన్నిస్‌లో గొప్ప ప్రదర్శనలు చేయాలని నిర్ణయించుకున్నా' అని జకోవిచ్ చెప్పాడు. పారిస్‌లో జరుగబోయే ఫ్రెంచ్ ఓపెన్‌కు పూర్తిగా ఫిట్‌గా ఉంటారా? అనే ప్రశ్నకు సర్వశక్తులు ఒడ్డుతానని పేర్కొన్నాడు.

'ప్రస్తుతానికైతే నా పరిస్థితి అలానే ఉంది. టోర్నీకి సమయం ఉన్నందున నేను మరింత కష్టపడుతాను. నా శరీరం అనుమతించినంతవరకూ శిక్షణ తీసుకుంటా. ఈ శ్రమంతా కోర్టులో ఎలా పనికొస్తుంది అనేది ఊహించలేం' అని జకోవిచ్



తెలిపాడు. మే 18వ తేదీ నుంచి ఫ్రెంచ్ ఓపెన్ షురూ కానుంది. జూన్ 7 వరకూ సాగే ఈ మట్టి కోర్టు పోరులో ఛాంపియన్‌గా నిలిచేది ఎవరు? అనేది ఉత్కంఠ రేపుతోంది.

రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్, ఆండీ ముర్రే.. వంటి దిగ్గజాలకు సవాల్ విసిరిన జకోవిచ్ ఖాతాలో ప్రస్తుతం 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ఆస్ట్రేలియా ఓపెన్‌ను 10 సార్లు గెలుచుకున్న ఈ సెర్బియా స్టార్ వింబుల్డన్‌లో ఏడు పర్యాయాలు ఛాంపియన్. యూఎస్ ఓపెన్‌లో నాలుగు, ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడు దఫాలు విజేత. ప్రస్తుతం పురుషుల టెన్నిస్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ విజేత జకోవిచే.

### ప్రిజ్మిక్ ధాటికి

ఒకప్పుడు దుమ్మురేపే ఆటతో ప్రత్యర్థులను వణికించిన ఈ సెర్బియా దిగ్గజం ఇటాలియన్ ఓపెన్‌లో 20 ఏళ్ల డినో ప్రిజ్మిక్‌కు తలొగ్గాడు. తొలి సెట్‌ను గెలుచుకున్నప్పటికీ చివరి రెండు సెట్లలో ప్రిజ్మిక్ ధాటికి జకోవిచ్ చేతులెత్తేశాడు. మొదటి సెట్‌ను 2-6తో కోల్పోయిన ఈ క్రొయేషియా క్వాలిఫయర్ 6-2, 6-4తో జకోకు చెక్ పెట్టి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు.

# వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఫరియా అద్భుల్లా

## Faria Abdullah



టాకీస్: అందాల భామ ఫరియా అద్భుల్లా వరుస సినిమాలతో దూసుకుపోతుంది. హిట్లు ఫ్లాప్స్‌తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది ఈ అందాల తార. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది ఈ చిన్నది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది ఈ ముద్దుగుమ్మ. త్వరలోనే భగవంతుడు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది . తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఫరియా అద్భుల్లా ఆసక్తికర విషయాలను పంచుకుంది. నటి తన కెరీర్ ప్రయాణంలో వంద కోట్ల రూపాయలు వసూలు చేసే చిత్రాలు, స్టార్‌డమ్‌పై కాకుండా తన సృజనాత్మక ప్రాధాన్యతలకు కట్టుబడి ఉన్నట్లు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపింది. అధిక పారితోషికం, కమర్షియల్ విజయం ఒకవైపు ఉన్నప్పటికీ, ఆమె తన ప్రత్యేకమైన మైండ్‌సెట్‌తో విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతుంది.

ఫరియా మాట్లాడుతూ.. వంద కోట్ల సినిమా ఆఫర్ వస్తే నేనెందుకు చేయను. ? చేస్తాను కదా," అని నవ్వుతూ చెప్పింది. చిట్టి వంటి పాత్రల ద్వారా వచ్చిన అభిమానుల ఆదరణే తన నిజమైన ప్రేరణ అని ఆమె తెలిపింది..

జాతిరత్నాలు చిత్రంలో చిట్టి పాత్రకు డబ్బింగ్ చెప్పిన అనుభవం గురించి మాట్లాడుతూ.. ఆ చిత్రానికి ఎంపికయ్యే సమయానికి ఆమెకు తెలుగు సరిగా రాదని చెప్పింది. అయినా, తన వాయిస్‌కి ప్రజల నుంచి వచ్చిన ఆదరణ చూసి ఆశ్చర్యపోయానని తెలిపింది. షూటింగ్ సమయంలో తెలుగు మాట్లాడే వారితో కలిసి ఉండటం ద్వారా భాషను నేర్చుకున్నానని, స్టేజ్‌పై ధైర్యంగా మాట్లాడగలిగానని ఆమె చెప్పుకొచ్చింది. ఇది కేవలం ఆమె నటనకు మాత్రమే కాకుండా, ఆమె వాయిస్‌కి కూడా లభించిన ప్రశంస అని తెలిపింది.

తన తాజా చిత్రం గాయపడ్డ సింహం గురించి మాట్లాడుతూ.. తన పాత్ర పరిచయ సన్నివేశం ఎలా ఉండేదో వెల్లడించారు. తాను స్టేజ్‌పై చాలా "చెత్తగా" డ్యాన్స్ చేస్తుండగా, హీరో తన స్నేహితుడితో "ఇంత చెత్తగా డ్యాన్స్ చేస్తుందంటే కచ్చితంగా నాకు పడుద్దిరా" అని చెప్పే సన్నివేశాన్ని ఆమె పంచుకుంది. ఈ జోక్ వినగానే తాను ఈ పాత్ర చేయడానికి అంగీకరించానని తెలిపింది. గాయపడ్డ సింహం సినిమా విషయంలో తనకు నమ్మకాన్ని కలిగించిన అంశాలను వివరిస్తూ, తరుణ్ భాస్కర్ ఈ చిత్రానికి ఓకే చెప్పడం ప్రధాన కారణమని.. పవన్ సాధినేని డైరెక్టర్‌ను, కథను సిఫార్సు చేయడంతో పాటు, ఒక ప్లాట్‌లైన్ వినగానే ఇది కామెడీగా ఉంటుందని, ఎవరూ ఊహించని విధంగా ఉంటుందని భావించి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చానని తెలిపింది.

MOVIE TIME

## రణబాలి నుంచి గ్లింప్స్ విడుదల



టాకీస్: టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు 'రణబాలి' చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. విజయ్‌కి బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. తాజాగా ఈ సినిమా నుంచి కొత్త గ్లింప్స్‌ను పంచుకుంది చిత్రయూనిట్. టాక్సీవాలా వంటి ఘనవిజయం తర్వాత విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ భారీ చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 19వ శతాబ్దపు రాయలసీమ నేపథ్యంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సరసన రష్మిక మందన్న 'జయమ్మ' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తుండగా, వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న హ్యాట్రిక్ చిత్రం కావడంతో ఫ్యాన్స్‌లో క్రేజ్ రెట్టింపు అయింది. ఈ చిత్రంలో మరో ప్రధాన ఆకర్షణ ఏమిటంటే, 'ది మమ్మీ' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ, సర్ థియోడర్ హెక్టర్ అనే బ్రిటిష్ అధికారిగా విలన్ పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ మరియు టి-సిరీస్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు అజయ్-అతుల్ సంగీతాన్ని అందిస్తుండగా, నీరవ్ షా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

## శరవేగంగా ఇరుముడి చిత్ర నిర్మాణం

టాకీస్: మాస్ మహారాజ రవితేజ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఇరుముడి ప్రస్తుతం టాలీవుడ్‌లో మంచి హైప్‌ను క్రియేట్ చేస్తోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా మొదటి అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా డివోషనల్ టచ్‌తో పాటు ఎమోషనల్ డ్రామాను కలగలిపిన కథాంశంతో ఈ సినిమా రాబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగాయి.




ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ గత చిత్రాలకు భిన్నంగా ఓ పవర్‌ఫుల్ మరియు భావోద్వేగభరిత పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు బలమైన భావోద్వేగాలు కూడా సినిమాలో ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, తాజాగా లభించిన సమాచారం ప్రకారం చిత్రీకరణ దాదాపు చివరి దశకు చేరుకుందని తెలుస్తోంది. ఇంకా సుమారు నెల రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.

దీంతో మేకర్స్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో పనులు పూర్తి చేసే దిశగా ముందుకెళ్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని జీవి ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు. ఇప్పటికే పలువురు భిన్నమైన ప్రాజెక్టులతో తన మార్క్ చూపించిన జీవి ప్రకాష్.. 'ఇరుముడి' కోసం కూడా ప్రత్యేకమైన మ్యూజిక్ వర్క్ చేస్తున్నారని సమాచారం. ముఖ్యంగా ఈ సినిమా కాన్సెప్ట్ పట్ల ఆయనే ఎంతో ఎంజైటెడ్‌గా ఉన్నారని టాలీవుడ్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది.

భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇటీవల వరుస విజయాలతో టాప్ ప్రొడక్షన్ హౌస్‌గా నిలిచిన మైత్రి సంస్థ.. 'ఇరుముడి'ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు. యాక్షన్, భక్తి, ఎమోషన్‌ల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ సంపాదించుకోవడం విశేషం. అన్ని పనులు పూర్తి చేసిన తర్వాత ఈ సినిమాను అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## రావు బహద్దూర్ మూవీ విడుదల వాయిదా


**టాకీస్:** వెర్సటైల్ నటుడు సత్యదేవ్, విలక్షణ దర్శకుడు వెంకటేష్ మహా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్' విడుదల తేదీ మరోసారి మారింది. ఈ చిత్రాన్ని తొలుత జూన్ 5న విడుదల చేయాలని చిత్ర బృందం భావించినప్పటికీ, జూన్ 4న రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల కానున్న నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద క్లాష్‌ను తప్పించడానికి మేకర్స్ వెనక్కి తగ్గారు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం




జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు తన సొంత బ్యానర్ 'జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్' ద్వారా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే మరియు ఎడిటింగ్ బాధ్యతలను కూడా స్వయంగా నిర్వహిస్తున్నారు. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాల పరాశర్, ఆనంద్ భారతి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఒక పురాతన రాజవంశం, వారసత్వం మరియు రహస్యాల చుట్టూ తిరిగే గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సత్యదేవ్ పవర్ ఫుల్ ఎల్డర్లీ లుక్‌లో కనిపించబోతున్నారు. 'అనుమానం పెనుభూతం' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే విడుదలైన పోస్టర్లు మరియు 'ఓ సుందరి' సాంగ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచాయి.

## రౌడీ జనార్ధన్ నుంచి ప్రత్యేక పోస్టర్ విడుదల

**టాకీస్:** టాలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర యూనిట్ అదిరిపోయే కానుక అందించింది. యువ దర్శకుడు రవికిరణ్ కోల దర్శకత్వంలో విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'రౌడీ జనార్ధన్. వరుస సినిమాలతో, విభిన్నమైన కథలతో ప్రేక్షకుల ముందుకువస్తున్నారు నటుడు విజయ్ దేవరకొండ. ప్రస్తుతం రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఆయన నటిస్తోన్న చిత్రం 'రౌడీ జనార్దన్'. విజయ్ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ప్రత్యేక పోస్టర్ పంచుకుంది. ఇప్పటివరకూ విజయ్ సీరియస్ లుక్‌లో ఉన్న ఫొటోలు పంచుకున్న చిత్రబృందం తాజాగా ఓ లవ్లీ పోస్టర్‌ను షేర్ చేసింది. 'ప్రపంచంతో పోరాడతాడు.. ప్రేమకు లొంగిపోతాడు' అంటూ విజయ్‌కు విషెస్ తెలిపింది. ఇందులో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ కనిపించనున్నారు. దిల్‌రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఆయన ఇందులో విజయ్ పాత్ర గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. 'విజయ్ దేవరకొండ ఇప్పటివరకు విభిన్నమైన సినిమాలు చేస్తూ వచ్చాడు. కానీ, ఇలాంటి పూర్తిస్థాయి మాస్ పాత్ర ఇంతవరకు చేయలేదు.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.